# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి: 15 సంచిక: 3 ఏప్రిల్ 2026 వెల: రూ. 5/-




ఏపిడబ్ల్యుజెఎఫ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభలో ప్రసంగిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వేదికపై ఇతర నాయకులు




ఏపిడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభను జ్యోతి ప్రజ్వలనతో ఆరంభిస్తున్న చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని




ఎపిబిజెఎ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో ఎన్నికైన నూతన కమిటీతో శాసనసభ్యులు బడేటి చంటి




ఏపిడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాస్‌లు




ఎపిబిజెఎ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో శాసనసభ్యులు బడేటి చంటిని సత్కరిస్తున్న దృశ్యం




డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ కమిటీలకు నూతనంగా ఎన్నికయిన సభ్యులు

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 15   ఏప్రిల్ 2026   సంచిక: 3**


## లోపలి పేజీల్లో...


తమిళనాట జర్నలిస్టుల పెన్షన్ పెంపు ......... 4

జర్నలిస్టుల సంక్షేమానికి 10 లక్షల విరాళం ............. 5

కార్మిక మంత్రి సుభాష్ ఉదారత ................ 6

ఏలూరు జిల్లా ఎపిబిజెఎ కమిటీ ఎన్నిక ........................ 7

సరదాగా చదువుకోండి! హాయిగా నవ్వుకోండి!! ............ 8

జర్నలిస్టులకు అన్నివేళలా అండగా నిలుస్తాం .......................... 11

ఈపిఎఫ్ఒ ఏకపక్ష దాడి ....................... 13

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యలో రాయితీ కల్పించాలి ................... 16

ప్రణయ్‌రాయ్ దంపతులపై లుకౌట్ ఉత్తర్వులు రద్దు ----------- 18

సిజెఐగారూ కార్మికులు పురుగుల్లా చావాలా? ..................... 20

విశాఖలో ఉగాది ఉత్సవాలు ....... 23

పాఠకులు, పౌరసమాజంతోనే జర్నలిజం మనుగడ ...... 24



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య   ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| వి.భక్తవత్సలం | ఒ.శాంతి |
| ఎస్.మురళీశంకర్ | కె.ఎస్.శంకరరావు |
| జి. శీనుబాబు | డి.మధుసూదనరావు |

డిప్యూటీ ఎడిటర్: జిలాని ఎస్.ఎం

**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం సానుకోలంగా స్పందిస్తున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో మార్చి 4 జర్నలిస్టుల ప్రదర్శన, సభ జరిగింది. రాష్ట్రం నుంచి పెద్దఎత్తున జర్నలిస్టులు హాజరయ్యారు. సభకు హాజరైన మంత్రి కొలుసు పార్థసారధి జర్నలిస్టుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృష చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలుకు నోచుకుంటున్నదని సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ వైఖరిని బట్టి స్పష్టమవుతోంది. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు యేడాదిలో రెండుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్‌పై మంచి స్పందన ఉంది. వివిధ జిల్లాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, బాపట్ల, కాకినాడ తదితర జిల్లాల్లో వైద్య పరీక్షల శిబిరాలను జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి స్వయంగా మంత్రి ఐదు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. ప్రభుత్వంలోని మిగిలిన మంత్రులు, శాసనసభ్యులందరినీ జర్నలిస్టుల సంక్షేమనిధికి ఒక నెల వేతనం విరాళంగా ప్రకటించమని ఫెడరేషన్‌గా మనం కోరడం సముచితంగా ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధికి విడతలవారీగా యాభై కోట్ల రూపాయలు ఇచ్చేందుకు ప్రయత్నించేందుకు సంఘం నుంచి ప్రయత్నం జరగాలి. జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీ, జిల్లా కమిటీలు, ఇతర కమిటీల ఏర్పాటు త్వరలో జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇంటి స్థలాల సమస్యపై ప్రభుత్వం చర్చిస్తుందని సమాచార శాఖ మంత్రి చెప్పడమే కాక తన పరిధిలో ఉన్న గృహనిర్మాణ శాఖ ద్వారా జర్నలిస్టుల ఇంటి నిర్మాణానికి గల అవకాశాలను అన్వేషిస్తున్నానని సభలో చెప్పిన మాట ఆచరణలో కార్యరూపం దాల్చేందుకు మనవంతు ఒత్తిడి, ప్రయత్నం అవసరం. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేశారు. జర్నలిస్టుల వృద్ధాశ్రమ నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అన్నింటినీ మించిన మన వృత్తికి సంబంధించిన ప్రధాన సమస్య మీడియా కమిషన్ ఏర్పాటుపై ఎటువంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఈ సమస్య లోతుపాతులను ప్రభుత్వం అర్థం చేసుకుని పరిష్కారానికి చొరవ చూపేందుకు వీలుగా అన్ని జిల్లాలతో పాటు రాష్ట్ర కేంద్రంలో సభలు, సమావేశాలు నిర్వహించి విస్తృతంగా ప్రచారం సాగించడం ద్వారా ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేందుకు వీలుంటుంది. ఆ దిశగా ఫెడరేషన్ జిల్లా శాఖలు, రాష్ట్ర కమిటీ ప్రయత్నం చేయాల్సి ఉంది.

# తమిళనాట జర్నలిస్టుల పెన్షన్ పెంపు

మార్చి 13, 2026న, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ రాష్ట్రంలోని జర్నలిస్టుల నెలవారీ పెన్షన్‌ను గణనీయంగా పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు.

**పెన్షన్ పెంపునకు సంబంధించిన ముఖ్యాంశాలు:**

**జర్నలిస్టుల పెన్షన్:** పదవీ విరమణ పొందిన జర్నలిస్టుల నెలవారీ పెన్షన్‌ను 12,000 రూపాయల నుండి 15,000రూపాయలకు పెంచారు.

**కుటుంబ పెన్షన్:** మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు (ఆధారపడిన వారికి) ఇచ్చే కుటుంబ పెన్షన్‌ను 6,000 రూపాయల నుండి 7,500 రూపాయలకు పెంచారు.

**వైద్య బీమా:** గుర్తింపు కార్డులు కలిగిన జర్నలిస్టులందరినీ 'ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం' పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గృహ వసతి:** కొత్తగా ఏర్పాటు చేసిన ఒక సహకార గృహ నిర్మాణ సంఘం ద్వారా, చెంగల్పట్టు జిల్లాలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నారు.

సచివాలయంలో ముఖ్యమంత్రి, చెన్నై ప్రెస్ క్లబ్ ప్రతినిధుల మధ్య జరిగిన సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

---




## జర్నలిస్టుల పెన్షన్ కోసం ప్రధానితో చర్చిస్తా

దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని ప్రధానమంత్రితో చర్చించి అర్హులైన వారందరికీ పెన్షన్ అందేలా కృషి చేస్తామని కేంద్ర విద్యుత్ పునరుత్పాదక ఇంధన శాఖ మాత్యులు శ్రీపాద నాయక్ పేర్కొన్నారు. గోవా ఫ్రెండ్స్ సెంటర్లో ప్రారంభమైన సీనియర్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రథమ జాతీయ సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుల సమస్యను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టు నాయకులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం పత్రిక స్వేచ్ఛ కాపాడే విషయంలో జర్నలిస్టుల సమస్యల పట్ల సానుకూలంగా ఉందని భరోసా ఇచ్చారు. గోవా సమాచార శాఖ డైరెక్టర్ దీపక్ బండేకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పట్ల గోవా ప్రభుత్వం పూర్తి అవగాహనతో పలు సామాజిక భద్రతా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సందీప్ దీక్షిత్ అధ్యక్షత వహించగా ఎస్పీ చేకుట్టి దేశవ్యాప్తంగా పలువురు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

---

## కనీస పెన్షన్ పెంచాలని పార్లమెంటరీ ప్యానల్ సూచన

ఈపీఎఫ్ చందాదారులు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్‌కు సంబంధించి పార్లమెంటరీ ప్యానల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయ్ పెన్షన్ స్కీం 1995 కింద ప్రస్తుతం చెల్లిస్తున్న వెయ్యి రూపాయల కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ సూచించింది. ఈ మొత్తం వాస్తవికంగా గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు లేబర్ టెక్స్టైల్స్ స్కిల్ డెవలప్మెంట్ పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 15వ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఈపీఎఫ్ కనీస పెన్షన్ పెంచాలని పెన్షనర్లు ఏళ్లుగా డిమాండ్లు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పుడు ఇస్తున్న వెయ్యి రూపాయలు సరిపోవడంలేదని కనీసం 7500 కు పెంచాలని వారు కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజులపాటు ధర్నా నిర్వహించారు. కనీస పెన్షన్‌పై ఇప్పటికే పెన్షనర్ల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని పార్లమెంటరీ స్థాయి సంఘం స్పందించింది.

# జర్నలిస్టుల సంక్షేమానికి 10 లక్షల విరాళం

## కార్మిక మంత్రి సుభాష్ ప్రకటన

జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పడమే కాకుండా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ జిల్లా సంఘ సంక్షేమనిధికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పది లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఆయనతో పాటు మహాసభకు హాజరైన అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు యాభై వేల రూపాయల విరాళం ప్రకటించారు. పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ల ప్రథమ మహాసభను మార్చి 29వ తేదీ నిర్వహించారు. ఆ సందర్భంగా మంత్రి సుభాష్ ఎపిడబ్ల్యూజేఎఫ్, ఎపిబీజేఏ జర్నలిస్టుల సంక్షేమ నిధికి పది లక్షలు విరాళం ప్రకటించారు. వర్కింగ్ జర్నలిస్టులను అసంఘటిత కార్మికులకు గుర్తించే కృషి చేస్తారని అన్నారు. ప్రభుత్వం తరఫున ఇళ్ల స్థలాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని స్థానిక శాసనసభ్యులు ఆనందరావు తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న అమలాపురం పార్లమెంటు మాజీ సభ్యురాలు చింతా అనురాధ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను తెలుసుకుని చాలా ఆవేదన చెందుతున్నానన్నారు. జర్నలిస్టులకు అన్నివేళలా అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. శాసనమండలి సభ్యులు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయెల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐతాబత్తుల సుభాషిణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంటెద్దు వెంకటనారాయణ, గన్నవరపు శ్రీనివాస్, కుంచె రమణారావు తదితరులు






పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం ఆరంభమైన మహాసభ సాయంకాలం వరకూ సాగింది. మహాసభ ఫెడరేషన్, ఎపిబిజెఎ జిల్లా కమిటీలకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నది.

**ఎపిడబ్ల్యుజెఎఫ్ కమిటీ**

ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులుగా మట్టపర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పెయ్యల వెంకటేశ్వరరావు, మట్టపర్తి రవీంద్రనాథ్ కార్యదర్శిగా వాకాడ బాబులు, కోశాధికారిగా కడలి సూరిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆకుల సురేష్, సహాయ కార్యదర్శులుగా తాటికాయల ధనరాజు, బొక్క రాజు, కార్యవర్గ సభ్యులుగా బడుగు వెంకటేశ్వరరావు, నామాడి ఫణిశేఖర్, పేపకాయల రాజు, సత్యాల కిరణ్, కొండేపూడి బుల్లి రాజు, కారుపల్లి శ్రీనివాస్, యండ్ర శ్రీనివాస్, దేవానందం, బొక్కా తమ్మ రాజులు ఎన్నికయ్యారు.

**ఎపిబిజెఎ కమిటీ**

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా కడలి రాజు, ఉపాధ్యక్షులుగా దొడ్ల మోహనరావు, కార్యదర్శిగా పరమట భీమ మహేష్, కోశాధికారిగా విజయ్, సహాయ కార్యదర్శిగా అద్దంకి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా మోత వెంకటేశ్వరరావు, కొండేపూడి గణపతి, అబ్బాస్, విత్తనాల చిట్టిబాబు, ఎం విజయ్, దంగేటి వెంకటేశ్వరరావు, నల్లి జగదీష్, మట్టపర్తి రాజులు ఎన్నికయ్యారు.

# కార్మిక మంత్రి సుభాష్ ఉదారత

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహాసభల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల తనకున్న అభిమానాన్ని, బాధ్యతను చాటుకుంటూ పలు కీలక ప్రకటనలు చేశారు, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ సంఘాల

సంక్షేమ నిధి కోసం మంత్రి తన వంతుగా 10 లక్షల రూపాయల భారీ విరాళాన్ని ప్రకటించారు. వృత్తి రీత్యా జర్నలిస్టులు ఎదుర్కొనే ప్రమాదాల పట్ల స్పందిస్తూ, ఏదైనా ప్రమాదంలో జర్నలిస్టు గాయపడితే ఐదువేల రూపాయలు, ఒకవేళ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి పదివేల రూపాయలు తన సొంత ఖర్చులతో తక్షణ సాయంగా అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులను కూడా అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి, వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలు, బీమా వంటి సదుపాయాలు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల కష్టనష్టాలను గుర్తించి, వారి కుటుంబాలకు అండగా నిలుస్తానని ప్రకటించిన మంత్రి సుభాష్‌పై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చూపిన ఈ ఔదార్యం ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తుందని సభలో పాల్గొన్న పలువురు వక్తలు కొనియాడారు.



**ఏలూరు ఎపిబిజెఎ జిల్లా మహాసభలో నూతన కమిటీ సభ్యుల జాబితాను ప్రకటిస్తున్న దృశ్యం**

# ఏలూరు జిల్లా ఎపిబిజెఎ కమిటీ ఎన్నిక




జర్నలిస్టుల సంక్షేమం కోసమే తాను అహర్నిశలు ఆరాటపడుతుంటానని ప్రతి కార్యక్రమంలో మంచిని చూడటం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని ఏలూరు శాసన సభ్యుడు, తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బడేటి చంటి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఎపిబిజెఎ) జిల్లా ప్రధమ మహాసభ మార్చి 30న జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మినిస్ట్రీరియల్ స్టాఫ్ మీటింగ్ హాల్లో జరిగింది. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డి జబీర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఎమ్మెల్యే చంటి విశిష్ట అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎపిబిజెఎ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మెల్యే చంటి వారిని అభినందిస్తూ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ ఇంటి స్థలం ఇవ్వడానికి కృషి చేస్తానని గతంలోనే జాబితా ఇవ్వమని కోరినట్టు గుర్తు జేశారు. ఫెడరేషన్ జిల్లా కార్యాలయం ఏర్పాటుకు తాను సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఎపిబిజెఎ నూతన కమిటీ బ్రాడ్‌కాస్ట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని కోరారు. ఏలూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. మీడియా ఇందుకు సహకారం అందించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావడం కోసం మార్చి 4న తాము నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ఆనాటి సభకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన సమాచార శాఖ మంత్రి పార్ధసారధి సమాచార శాఖ అధీనంలోని వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ ఫండ్‌కు వ్యక్తిగతంగా ఐదులక్షలు విరాళం



ప్రకటించారన్నారు. అమలాపురంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆ జిల్లా ఫెడరేషన్ సంక్షేమనిధి కోసం పది లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చిన విషయం ప్రస్తావించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏలూరు జిల్లాలో సిఎన్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఎన్నికైన నూతన కమిటీని ఎమ్మెల్యే చంటి శాలువాలతో ఘనంగా సత్కరించారు. తదుపరి ఎమ్మెల్యేను ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు బాలశౌరి, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శంకర్రావు, కళ్యాణ్, మహా న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ ఎం. భరత్, బి ఆర్ కే న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ కే.బ్రహ్మం, 99 టీవీ స్టాఫ్ రిపోర్టర్ రాంబాబు, మెగా 9 టీవీ స్టాఫ్ రిపోర్టర్ చైతన్య, స్వతంత్ర టీవీ స్టాఫ్ రిపోర్టర్ సంజయ్, క్రైమ్ రిపోర్టర్ ఊర్ల శీను, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏలూరు జిల్లా ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సోమశేఖర్, కోశాధికారి కె.చిన్నారావు, మంజీరగళం అధినేత పి.శేఖర్, ప్రతాప్, శరత్, జయరాం, సజ్జి మ్యాచెన్, దాస్, మిల్టన్ ప్రతాప్ ,సతీష్, చింతపల్లి శ్రీనివాస్, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నికలు పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెంట నారాయణ, ఎం. కిరణ్ ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. పి.సుమన్, డి.సత్యనారాయణ ను ఉపాధ్యక్షులుగా, డి. దాస్ కోశాధికారిగా, బాషా సహాయ కార్యదర్శిగా మరో తొమ్మిదిమందితో కార్యవర్గం ఎన్నికయింది.

# సరదాగా చదువుకోండి! హాయిగా నవ్వుకోండి!!

చాలా అద్భుతంగా, అమోఘంగా.....
వెయ్యండి పది వీరతాళ్ళు !
అవునూ...అజ్ఞాతంలో ఉన్నవాడికి వీరతాళ్ళు ఎలా వెయ్యడం ?
సుందర తెలుగు..
చచ్చినట్టు' బతికించే భాష!
తెలుగువాడికి సాటి ఇంకొకడు లేడు. అందరిదీ ఒక దారైతే మనవాడిది ఇంకోదారి!
(అంటే మనవాడు ఉలిపికట్టా ?)
అందరూ పొగ పీలిస్తే తెలుగువాడు పొగ తాగుతాడు.
ఇంతేకాదు తెలుగువాడు దెబ్బలు 'తింటాడు'! దెబ్బలు ఏమైనా తినే పదార్థాలా? అంటే ఉలకడు పలకడు. సంస్కృతం అమరభాష అంటారు. దాని సంగతేమో కానీ, తెలుగు మాత్రం కచ్చితంగా అమరభాషే ! ఇందుకు ఉదాహరణలున్నాయి. ఎవరి మీద అయినా ప్రేమ వచ్చినా, కోపమొచ్చినా 'సచ్చినోడా' అని తెలుగువాడు పిలుస్తాడు. 'సచ్చినోడు' ఎలా పలుకుతాడని ఆలోచించడు.
చచ్చినా ఒప్పుకోను అంటాడు. చస్తే ఎలా ఒప్పుకుంటాడు? చచ్చినాక ఒప్పుకుని చూపించిన వాడు ఒక్కడైనా ఉన్నాడా?
ఆశ చావడం లేదంటాడు. చెట్లకే ప్రాణం ఉందని చెప్పుకుని చావనివాళ్లు, ఇంకా ఉన్నారు. అలాంటి వాళ్లు ఆశకు ప్రాణం ఉంటుందని ఎలా ఒప్పుకుని 'చస్తా'రు?
తెలుగువాడు కంటి చూపుతో చంపేస్తాడు. అతడి శక్తి అలాంటిది.
ఇలాంటి అతీత శక్తులు యావత్ ప్రపంచంలో తెలుగువాడికి మాత్రమే ఉన్నాయి.
ఎంత గొప్ప ! ఎంత చిత్రం !
మత్తు పానీయాలైన సారా, బ్రాందీ, విస్కీలను 'సేవిస్తున్నా' నంటాడు. అదే సమయంలో మంచినీళ్లు తాగుతున్నానంటాడు తప్ప సేవిస్తున్నాననడు.
ఇదేం చిత్రమో!
ఇంకా చిత్రమేంటంటే మందు 'కొడుతున్నా' నంటాడు. కొట్టడానికి మందేమన్నా మనిషా? పశువా?
బాతాఖానీ కొట్టకు అంటాడు. దీని పరిస్థితీ ఇదే. అనారోగ్యకరమైన నిషా పానీయాన్ని ఆరోగ్యప్రదాయిని అయిన మందు పేరుతో పిలుస్తాడు! అంతా 'మందే' (మనదే) అనుకునేవాడు తప్ప ఇంకెవ్వడైనా ఈ పని చేయగలడా?
తెలుగువాడు ఎందులోనైనా ఆటను చూడగలడు. మాట్లాడతానంటాడు. పోట్లాడతానంటాడు.
మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటాడు. మనసు పూర్తిగా కాకుండా అందులో ఏభై శాతమో, డెబ్భైఅయిదు శాతమో ఉంచి కోరుకుంటాడా ఏంటి?
ఇంకోమాట!
హృదయపూర్వకంగా అభినందిస్తున్నానంటాడు. కాసేపు హృదయాన్ని పక్కనబెడితే, అభినందించే అవకాశం ఉందా? ఉంటుందా? తెలుగువాడి 'న్యాయమే' వేరు.
బడాయి గానీ మాట మాట్లాడితే 'మనస్సాక్షిగా' అంటాడు. మనసుకు ఏమన్నా రూపం ఉందా? మాట ఉందా? వచ్చి సాక్ష్యం చెప్పడానికి!
అగ్నిసాక్షిగా పెళ్లాడాను అని కూడా అంటాడు. అగ్ని ఏదో చిటపటలాడుతుంది కానీ ఎవరైనా సంసారంలో చిచ్చుపెడితే అదొచ్చి అడ్డుపడుతుందా ఏంటి ?
కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాడంటాడు! పోసుకోమనండి చూద్దాం!
పెళ్లికాని ఆడపిల్లను గుండెల మీద కుంపటి అంటాడు. ఇది ఎంత తప్పు! గుండెల మీద కుంపటి పెట్టుకున్న మొనగాళ్లు యావత్ భూప్రపంచంలో ఎవరైనా ఉన్నారా?
మాటేగా ఏదైనా అంటాడు. గుండె మీద బరువు తగ్గించుకున్నానంటాడు. గుండెల మీద బట్టల బరువు తప్ప ఇంకేం బరువు ఉంటుంది!
నవ్వితే నవరత్నాలు రాలతాయంటాడు. రత్నాలా పాడా? మరీ గట్టిగా నవ్వితే పళ్లు రాలిపోతాయేమో! చిటికెలో పని అయిపోతుందంటాడు.
అతిశయం కాకపోతే చిటికె వేస్తే శబ్దం అవుతుంది కానీ పని ఎలా అవుతుంది !
ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్ అని గురజాడ చెప్పినా మనవాళ్లు వినరు.
అప్పు తీసుకునేటప్పుడు 'నీ డబ్బు వడ్డీతో సహా పువ్వుల్లో పెట్టి ఇస్తా' నంటారు. వడ్డీ ఇస్తే ఇవ్వచ్చుగానీ పువ్వుల్లో పెట్టి ఇచ్చినవాడు ఎవడైనా ఉన్నాడా? ఇది అప్పిచ్చిన పిచ్చివాడి చెవిలో పువ్వు పెట్టడం కాదూ!
ఎవరో చిన్నచూపు చూస్తున్నారని తెలుగువాడు ఆక్షేపిస్తాడు. దూరపు చూపు, దగ్గరి చూపు ఉంటాయి తప్ప చిన్న చూపు, పెద్ద చూపు అని ఎక్కడైనా ఉంటాయా?
వంట చేయడాన్ని చేయి కాల్చుకోవడం అంటాడు. ఇదే నిజమైతే ఆడవాళ్ల చేతులన్నీ ఏమైపోయేవి !
సంగీతమంటే చెవి కోసుకుంటానని ఒక్కొక్కరు వంకర్లు తిరిగిపోతుంటారు. అయితే అతడు ఎంతసేపు పాటలు వింటున్నా కోసుకున్న చెవి కిందపడదే అని నిరాశ పడ్డవాళ్లూ ఉన్నారు.
తప్పు చేసినవాడు అడ్డంగా దొరికిపోయాడు అంటారు. దొరికినవాడెవడైనా అడ్డంగా దొరుకుతాడా? నిలువుగా దొరుకుతాడు తప్ప ?
అన్నట్టు గిట్టనివాణ్ని అడ్డమైనవాడు అని తిడతారు. అదేంటి? దాని భావమేంటి? పండితార్థం ఏమైనా పిండితార్థం ఒకటుంది.
పశువా అని తిట్టినట్టు. మనుషులు నిలువుగా ఉంటారు. పశువులు అడ్డంగా ఉంటాయి. అదీ సంగతి!

ఎవడి మీదైనా కోపం వస్తే, ఏ మొహం పెట్టుకుని వచ్చావంటాడు తెలుగువాడు. ఎవడికైనా ఒకటే ముఖం ఉంటుంది కానీ బ్రహ్మలాగా నాలుగు ముఖాలు, రావణబ్రహ్మలాగా పది ముఖాలు ఉండవు కదా!

ఫలానావాడు తలలు మార్చేరకం అనేది కూడా తెలుగువాడి వాడుక. ఇదెలా సాధ్యం? వినాయక వృత్తాంతంలోలాగా తలలు మార్చేశక్తి సామాన్య మానవులకు ఉంటుందా ?

తెలుగువాడు బండ చాకిరీ చేస్తానంటాడు. బండ.. దానికి ఒక మొహం! ఎక్కడ పడేస్తే అక్కడే ఉంటుంది కానీ అది చేసే చాకిరీ ఏముంటుంది? ఏముంది ఎడమ చేత్తో చేస్తానంటాడు. ఎడమ చేత్తో చేసే పనులేంటో అందరికీ తెలుసు. దానితో అన్ని పనులూ అతివేగంగా చేస్తానంటే ఎలా కుదురుతుంది?

అన్నం ఉడకలేదా అంటాడు. ఇదేంటి? ఉడికితే కానీ అన్నం కాదు కదా!

జోకులు పేల్లేదు అంటాడు. జోకు ఏమైనా బాంబా? పేలడానికి!

వీపు విమానం మోత మోగుతుందని అంటాడు. విమానం మోత మోగితే ఆ వీపు అసలు ఉంటుందా? మనిషి అసలు ఉంటాడా?

లేస్తే మనిషిని కానంటాడొకడు. మరి లేచినవాళ్లందరూ ఏంటి? అలాంటప్పుడు కూర్చుని ఉంటేనే మేలు కదా!

శక్తిని కూడా భక్తికి ముడి పెట్టడం తెలుగువాడికి రివాజు.

ఉన్న పూజలు చాలక బడితెపూజ ఒకటి.

జంతువుల్లో కూడా దేవుళ్లను చూసుకుని భారతీయులు ఆరాధిస్తారు. ఇందుకు తెలుగువాడు కూడా మినహాయింపు కాదు. ఎటొచ్చీ మనుషుల్లో జంతువుల్ని చూడటం అతగాడి ప్రత్యేకత.

గిట్టనివాళ్లను పంది, కుక్క, గాడిద అని తిట్టే తెలుగువాడు, ఇష్టమైనవాణ్ని పులి, సింహం, గుర్రం అని అభిమానంగా చూస్తాడు. పిలుస్తాడు. ఏదైనా కళ్లారా చూస్తే తప్ప నమ్మకూడదు. తెలుగు భాష ఇందుకు ఇంపు అయిన మినహాయింపు. గుండె జారిపోయింది అంటారు. ఇప్పటివరకు ఎవరికైనా జారిపోయిందా? లేదే !!!

నీ నోరు పడిపోను అని తిట్టిపోస్తారు. ఎవరి నోరు అయినా ఎప్పుడైనా పడిపోవడం చూశామా?

పాడమని అడిగితే గాయకులు గొంతుపోయింది అంటారు. గొంతు ఎక్కడికి పోతుంది? పోతే ఎవరు తీసుకురాగలరు?

నోరు పారేసుకోవడం అంటారు. అది ఎలా సాధ్యం?

మా ఆయనకు నోట్లో నాలుకలేదని ఓ ఇల్లాలు వాపోతుంటుంది. నోట్లో నాలుక లేకుండా మనిషి ఎలా ఉంటాడు?

వాసన చూడు అంటారు. వాసనను పీలుస్తారు కానీ ఎలా చూస్తాం?

రుచి చూడటం కూడా అంతే. ఎవరు చూడగలరు?

పత్రికలు చదివి చదివి, వాటిలోని పడికట్టు మాటలను కంఠస్థం చేసేశాడు తెలుగువాడు.

ఫలానావాడు బాధకు గురయ్యాడు అంటాడు. మధ్యలో గురి ఎందుకు? బాధపడ్డాడు అనొచ్చుగా.

దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడంటారు. దిగ్భ్రాంతి చెందాడు అనడు. దిగ్భ్రాంతిని ఎలా వ్యక్తం చేస్తాడంటే చెప్పడు.

తప్పు చేస్తే పాపం ! అంటాడు సరే. ఎదుటివాడు కష్టాల్లో ఉంటే అయ్యో 'పాపం'! అంటాడు. తెలుగు భాష ఏమన్నా పుణ్యానికి వచ్చిందా ఏంటి?

దేశ భాషలందు తెలుగు లెస్స

తెలుగు భాషా జిందాబాద్

---

# సీనియర్ జర్నలిస్ట్ షౌకత్ ఆకస్మిక మృతి



సీనియర్ జర్నలిస్ట్ షౌకత్ హెచ్ మహమ్మద్ (63) ఆకస్మికంగా మృతి చెందారు, హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో స్వల్ప అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. విశాఖకు చెందిన షౌకత్ దక్కన్ క్రానికల్ డెస్క్ జర్నలిస్టుగా 1985లో ఈ వృత్తిలో ప్రవేశించారు. షౌకత్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ అఫ్ ఇండియా, ఎకనామిక్ టైమ్స్ వంటి వివిధ వార్తా పత్రికల్లో పని చేశారు. హైదరాబాద్ డెక్కన్ క్రానికల్ బిజినెస్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. మలయాళ మనోరమ గ్రూప్‌కు చెందిన ది వీక్ తమిళనాడు ప్రతినిధిగా కొన్నేళ్లు పనిచేశారు. కొంతకాలం టాటా కన్సల్టెన్సీ సర్వీసులో సీనియర్ కన్సల్టెంట్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత విజయవాడలో టైమ్స్ అఫ్ ఇండియా స్పెషల్ కరస్పాండెంట్‌గా కొంతకాలం పనిచేశారు. షౌకత్ బిజినెస్ జర్నలిజంలో తనదైన ముద్రవేశారు. వృత్తి నియమాలను తుచ తప్పకుండా పాటించే షౌకత్ బాధ్యత కలిగిన జర్నలిస్టు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. షౌకత్ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎంఏ రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సహాయం



పత్రికా రంగంలో నిరంతరం వార్త సేకరణలో దశతాబ్ద కాలంగా సేవలందించిన సీనియర్ విలేకరి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం వీరవల్లి పాలెం గ్రామానికి చెందిన ముద్దన సుబ్రహ్మణ్యం అకస్మిక మృతి పట్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ తరపున కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. స్నేహశీలి అయిన సుబ్రహ్మణ్యం మరణం బాధాకరమని ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఫెడరేషన్ తరవున ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా పదివేల రూపాయల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులువాతా డ నవీన్, జర్నలిస్టులు మట్టపర్తి శ్రీనివాస్, కదలి రాజు, పెయ్యల వెంకటేశ్వరరావు, కదలి సూరిబాబు, పరమట బీమా మహేష్, మోత వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల నీలకంఠం కే మూర్తి, బి అగ్ని, బి రాము, బడుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కలిసిన ఫెడరేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు చెంగల్రాయులు(గాంధీ), వళిగళం గోపీ, ఉపాధ్యక్షులు చెంగల్రాయులు, సీనియర్ జర్నలిస్ట్ ఆలూరు గిరిధర్, తిరుపతి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బాలసుబ్రమణ్యం, కుమార్, మణి తదితరులు ఉన్నారు. నూతన కమిటీకి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫెడరేషన్ సన్నాహక సమావేశం



రాజమహేంద్రవరం లోని యుటిఎఫ్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం మార్చి 26 ఉదయం జరిగింది. ఏప్రిల్ నెలలో జిల్లా మహాసభ జరుపుటకు తగిన కార్యాచరణ, కొత్త సభ్యత్వాలు, నియోజకవర్గ స్థాయి కమిటీలు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సమావేశానికి కొత్త సభ్యులను ఆహ్వానించడంతో పాటు ఎపిబిజెఎ బలోపేతానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ రవి కుమార్, పోతుల వెంకటేష్, వరదా నాగేశ్వరావు, శ్రీనివాసాచారి, లింకన్, చెబోలు రాజు, దామోదర్, హరి గణేష్, జిల్లా ప్రజా శ్రీనివాస్, మురళి, సుబ్బు,రాంబాబు, డి.ఎస్. తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అన్ని వేళలా అండగా నిలుస్తాం

## తిరుపతి ప్రథమ మహాసభలో నాయకుల హామీ

తిరుపతి జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అన్ని వేళలా అండగా నిలుస్తామని తిరుపతి జిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రథమ మహాసభకు హాజరైన తిరుపతి, చంద్రగిరి శాసనసభ్యులు, ఇతర రాజకీయ నాయకులు స్పష్టం చేశారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్



తిరుపతి జిల్లా ప్రథమ మహాసభను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని ప్రారంభించారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు వెంకట్రావు తొలుత మాట్లాడుతూ జర్నలిజం గమనం పై మీడియా కమీషన్ వేయాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తుంది. జర్నలిస్టులకు సంబంధించి 13 డిమాండ్స్ సాధన కోసం ఈ నెల 4వ తేదీ విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించాం. జర్నలిజం తన స్వేచ్ఛను కోల్పోయింది. జర్నలిజం, వ్యాపారం, రాజకీయం కలిసి జర్నలిజాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. జర్నలిస్టుల విధులను యాజమాన్యాలు నిర్ణయిస్తున్నాయి. జర్నలిస్టులకు వృత్తి పరమైన భద్రత లేదు. సోషల్ మీడియా రాకతో ఎవరు జర్నలిస్టో తెలియని పరిస్థితి ఉంది. జర్నలిజం తీరుతెన్నుల పరిశీలనకు మీడియా కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఏఐతో ఫేక్ వీడియోస్ ప్రసారం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటుపై స్పందించాలని వెంకట్రావు కోరారు. ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులు తమ సమస్యల పట్ల స్పందిస్తారో అనేదానికి ఈ నెల 4వ తేదీ విజయవాడలో జరిగిన ర్యాలీ నిరూపించింది. జర్నలిస్టుల వృత్తి బాధ్యతలు మారాయి. సేవ్ జర్నలిజం...ప్రొటెక్ట్ జర్నలిజం అని నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపు వచ్చింది. మారుతున్న పరిస్థితులను చూసాక సేవ్ జర్నలిజం సరయిన నినాదంగా మారింది. ఎన్నో ఉద్యమాల్లో జర్నలిజం పాత్ర ఎనలేనిది. అక్రిడిటేషన్ ఒకప్పుడు వృత్తికి గుర్తింపుగా ఉండేది. ఇప్పుడు డిమాండ్‌గా మారింది. జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు ఎమ్మెల్యేల



చొరవతో జరుగుతున్నాయి. ఎన్డీఏ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇస్తామన్న హామీ నెరవేర్చాలి. దేశంలో 18 రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ ఇస్తున్నాయి. వివిధ వర్గాలకు ప్రభుత్వం పెన్షన్లు ఇస్తుంది. రాష్ట్రం మొత్తం కలిపిన రిటైర్డ్







జర్నలిస్టులు వెయ్యి మందికి పైగా లేరు. ప్రభుత్వం జర్నలిస్టులకు పెన్షన్ అమలు చేయాలని కోరుతున్నాం. ఎమ్మెల్యే పులివర్తి నాని జర్నలిస్ట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. డిజిటల్ మీడియా యాక్ట్ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. సంఘవ్యతిరేక శక్తుల నుంచి గతంలో జర్నలిస్టులపై దాడులు జరిగేవి. కానీ డిజిటల్ మీడియా యాక్ట్ ప్రకారం సోర్స్ చెప్పకుంటే జర్నలిస్టులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. వ్యక్తికి ప్రైవసీ ఉంటది.. ప్రభుత్వానికి ఎలా ప్రైవసీ ఉంటది. డిజిటల్ మీడియా యాక్ట్‌లో సవరణలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిష్కరించాలి. జర్నలిస్ట్ అటాక్ కమిటీని ఎనిమిది ఏళ్లుగా వేయడం లేదు.

మీడియా కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి.

చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మాట్లాడుతూ ఇళ్లు లేని జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయింపుతో పాటు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువనాయకులు లోకేష్‌లు కృషి చేస్తున్నారన్నారు. ఒకరిద్దరి వల్ల ఫేక్ వార్తలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అయినప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని, జర్నలిస్టు సంఘాలు ఈ విషయంలో ఆలోచన చేయాలని కోరారు.

తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు పని చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు వృత్తిలో ఎంతో నిబద్ధతతో పని చేస్తున్నారు. తిరుపతి, తిరుమల జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపునకు కృషి చేస్తానన్నారు.

టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంచి కోసం జర్నలిస్టులు అండగా నిలుస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిజం నిలుస్తోంది. ఫేక్ న్యూస్ రాసేవారు జర్నలిస్టులే కాదు. కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ మీడియా యాక్ట్‌లో సవరణకు కేంద్ర మంత్రి మురళీధర్‌తో కలిసి చర్చించేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానన్నారు. తిరుపతి జర్నలిస్టులకు భూ సమస్య కారణంగా అపార్ట్మెంట్ కట్టించి ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం అంటే ఒక ధైర్యం. సాంకేతికంగా వచ్చిన మార్పులతో క్షణాల్లో ప్రజలకు సమాచారం అందుతోంది. జర్నలిస్టుల సంక్షేమానికి నా వంతు కృషి చేస్తానన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నాయకులు అనేవాళ్ళు మీడియా లేకుంటే ప్రజలకు తెలిసే అవకాశాలు లేవు. నాయకుల తప్పులను జర్నలిస్టులు ఎత్తిచూపితే ఆరోపణలు చేస్తారు. ప్రభుత్వ వైఫల్యాలను జర్నలిస్టులు ఎత్తి చూపితే వారని పార్టీ వ్యతిరేకులని నాయకులు



ముద్రవేస్తున్నారు. సత్యాన్ని చెప్పేవాడు జర్నలిస్ట్. జర్నలిస్టుల డిమాండ్స్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

మహాసభ ఆరంభంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ఆరంభమైంది. మహాసభకు జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు సమావేశంలో శాలువాతో సత్కరించారు. ప్రారంభ సమావేశం ముగిసిన అనంతరం జిల్లా నూతన కమిటీని మహాసభ ఎన్నుకున్నది.

**ఏపిడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గాజుల చెంగల్రాయులు (గాంధీ), వళిగళం గోపి**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) తిరుపతి జిల్లా అధ్యక్షులుగా గాజుల చెంగల్రాయులు (గాంధీ) (మనం), కార్యదర్శిగా వళిగళం గోపి (ప్రజాశక్తి), కోశాధికారిగా కె.శ్రీనివాస్ (మనం) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.చెంగల్రాయులు, మల్లెల వాణి,

**(తరువాయి 12వ పేజీ)**

# ఈపీఎఫ్ఓ ఏకపక్ష దాడి

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కేంద్ర ధర్మకర్తల మండలి మార్చి 2న ఉద్యోగుల పెన్షన్ పథకం 1995 స్థానంలో ఈపీఎస్ 2026కు ఆమోదం తెలిపిన తీరు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నది. ఇటువంటి ఏకపక్ష చర్య కారణంగా కేంద్ర ప్రభుత్వ పారదర్శకత కూడా ప్రశ్నార్థకం అవుతోంది. కంట్రిబ్యూషన్ చెల్లిస్తున్న సుమారు 5.4 కోట్ల మంది సభ్యులు 82 లక్షల మంది పెన్షన్‌దారులను ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఈపీఎస్ ఉద్యోగుల భవిష్య నిధి డిపాజిట్ లింక్ ఇన్సూరెన్స్ పథకాలు సామాజిక భద్రత కోడ్ 2020కి సహజ పరిణామంగా రూపొందించబడినప్పటికీ ఇది 2025 నవంబర్‌లో ఇతర మూడు కోడ్లతో పాటు అకస్మాత్తుగా నోటిపై చేయబడింది. ప్రభుత్వం లేదా కార్మిక మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు కొత్త పథకాల గురించి ఎటువంటి సంకేతం, సమాచారం ఇవ్వలేదు. అధికారులు లబ్ధిదారులతో ఏ విధమైన సంప్రదింపులు జరపలేదు. ఏ ఇతర పథకం కంటే ఎక్కువగా ఈపీఎస్ 1995 గత దశా దశాబ్ద కాలంగా భారత సర్వోన్నత న్యాయస్థానంతో సహా వివిధ న్యాయస్థానాలలో విచారణల కారణంగా మీడియాలో ప్రముఖ స్థానం ఆక్రమించింది కూడా! అయినా ప్రభుత్వం ఏకపక్షంగా ఇటువంటి చర్యలకు పాల్పడడం తగదు.

గత 12 సంవత్సరాలుగా అంటే నరేంద్ర మోడీ నాయకత్వన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ పథకంలోని వివిధ అంశాలు ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా మార్చబడ్డాయి. ఉదాహరణకు పెన్షన్ పథకం విస్తృతిని ప్రారంభంలో ఉద్దేశించిన విధంగా సార్వత్రిక కవరేజీని అందించటానికి బదులుగా నెలకు 15 వేల రూపాయల వరకు సంపాదించే వారికి పరిమితం చేయడం చాలా ముఖ్యమైన మార్పు. పెన్షన్ పొంది జీతం గణన చివరి 12 నెలల సగటు నుంచి 60 నెలలకు మార్చబడింది. దీనివలన చెల్లించవలసిన పెన్షన్ మొత్తం గణనీయంగా తగ్గిపోయింది. 2014 సెప్టెంబర్ 1 అమలులోకి వచ్చిన సవరించిన పథకం నుంచి ఒక సంవత్సరంలోపు ఎంపికను ఉపయోగించుకున్న వారికి అధిక పెన్షన్‌పై అనియంత్రిత ఎంపిక పరిమితం చేయబడింది. అయితే 2022లో సుప్రీంకోర్టు జోక్యంతో 2014 తర్వాత రిటైర్ అయిన వారికి ప్రత్యేక కేసుగా అధిక పెన్షన్ ఎంపిక అవకాశం కల్పించారు. కానీ 2014కి ముందు రిటైర్ అయిన వారు ఇబ్బందుల్లో పడ్డారు. ఈపీఎఫ్ నిర్దేశించిన అవాస్తవిక పరిస్థితుల వల్ల వారిలో చాలామంది అధిక పెన్షన్‌కు అనర్హులయ్యారు. పెన్షన్‌దారులకు ఈ 12 ఏళ్ల పాలనలో కలిగిన మరో తీవ్ర నష్టం ఇది.

సిబిటి ఆమోదించిన కొత్త పెన్షన్ పథకంలో ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇస్తున్న నిబంధనలను తొలగించారు. అది చట్టపరమైన వివరణను ప్రతిబింబించేదిగా లేదని సాకుగా చెబుతున్నారు. అంతేకాకుండా పిఎఫ్ కంట్రిబ్యూషన్ చెల్లించేందుకు వేతన పరిమితి 15వేల రూపాయల కన్నా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సవరణ తీసుకొస్తుందని ఇప్పటివరకు ప్రచారం జరుగుతున్నది. కానీ ఆ దిశగా ఏ ప్రకటన రాలేదు. కేంద్ర ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. వేతన పరిమితి–కనీస పెన్షన్ ఒక వెయ్యి రూపాయలు. ఈ రెండు అంశాలు 11 సంవత్సరాల క్రితం నిర్ణయించినవి. ఈపీఎఫ్ఓ మొత్తం విధానం పరిశీలిస్తే లబ్ధిదారులకు చెల్లించవలసిన పెన్షన్ తగ్గించడమే దాని ఏకైక లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఎక్కువగా ప్రభుత్వ నిధులు యజమానుల నుంచి అలాగే స్వచ్ఛందంగా కంట్రిబ్యూషన్ చెల్లించే ఉద్యోగులనుంచి వచ్చే మొత్తాలతో ఈపీఎఫ్ఓ పెన్షన్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలదు. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ఓల నుంచి ఆశించేది అనుకూల సానుకూల దృక్పథం. అదేవిధంగా పెన్షన్‌దారులు కాంట్రిబ్యూషన్ చెల్లించే ఉద్యోగుల పట్ల సానుభూతి. అంతేతప్ప ఇలా చట్టాలు, నిబంధనలు విధానాల మార్పు కోట్లాదిమంది సభ్యులు, లక్షలాదిమంది పెన్షన్‌దారులు కోరుకున్న ఫలితాలను ఇవ్వబోవు. అహరహం శ్రమ చేసే కష్టజీవుల ఉసురు పోసుకునే సర్కార్లు మనలేవు. శ్రామికులు సంఘటితమై పోరాడితే పాలకులు శంకరగిరి మాన్యాలు పట్టాల్సి ఉంటుందని గుర్తెరగాలి.

**(ప్రజాశక్తి సంపాదకీయం)**

---

### జర్నలిస్టులకు అన్ని వేళలా అండగా నిలుస్తాం

**(11వ పేజీ తరువాయి)**

నందకుమార్, కె.రవి, డి.ధనశేఖర్, ఘట్టమనేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం.సురేష్ రాజు, డి.వి.రావు, పి.రాజారెడ్డి, జయకుమార్, సిఆర్ శ్రీనివాసన్, రాజారెడ్డిలను మహాసభ ఎన్నుకుంది. కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.తులసీరామ్, మీడియా కోఆర్డినేటర్‌గా పి.సుధీర్, కార్యవర్గ సభ్యులుగా పి.మునిభాస్కర్ రెడ్డి, కె.హరి బాబు, గంధం చంద్రశేఖర్, కె.నాగరాజు, రాధాసురేష్, ఎ.ప్రకాష్, కె.సుధాకర్, పి.యాసిన్, జి.చంద్రశేఖర్, ఆర్.భక్తవత్సల రెడ్డి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు సీనియర్ జర్నలిస్టు ఆదిమూలం శేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏపిడబ్ల్యుజెఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు తిరుపతిలోని రాస్ భవనంలో మార్చి 22న జరిగాయి.

# ప్రావిడెంట్ ఫండ్ ద్వారా ఉచితంగా జీవిత భీమా

ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల జీతం నుంచి ప్రామాణికంగా ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు డబ్బు డిడక్ట్ అవుతోంది. చాలామందికి ఈ డబ్బు పొదుపుగా మాత్రమే అనిపించినప్పటికీ ఇందులో ఒక గోప్యమైన లాభం కూడా ఉంటుంది. ఈపీఎఫ్ఓ ఉద్యోగులకు పెన్షన్ పొదుపు మాత్రమే కాకుండా ఉచిత జీవిత బీమా కూడా అందిస్తుంది.. ఈడీఎల్‌కు ఎంప్లాయ్ డిపాజిట్ లింక్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా ఉద్యోగి మరణించిన సందర్భంగా కుటుంబానికి ఆర్థిక రక్షణ ఇస్తుంది. దీనికోసం ఉద్యోగికి ఒక పైసా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ బీమా మొత్తం ఉద్యోగి జీతం ఆధారంగా నిర్ణయించబడుతుంది. గత 12 నెలల పాదమిక జీతం డియర్ నెస్ అలవెన్స్ ఆధారంగా సగటు జీతానికి 35 రేట్లు లెక్కించబడుతుంది. అదనంగా 1.75 లక్షల బోనస్‌ను జోడిస్తే గరిష్టంగా ఏడు లక్షల వరకు లాభం వస్తుంది. గరిష్ట జీత పరిమితిని 15 వేలుగా నిర్ణయించింది. అందువలన ఎక్కువ జీతం ఉన్న గరిష్ట కవర్ పరిమితం. పిఎఫ్ ఖాతాదారుడు సర్వీసులో ఉన్నప్పుడు మరణిస్తే వారి నామిని లేదా చట్టపరమైన వారసుడు బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. ఈ డి ఎల్ ఐ ఫారం 5 ఐఎఫ్ మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పుట్టిన తేదీ ఋజువు వంటి పత్రాలు సమర్పించాలి. నాన్ కంట్రిబ్యూటరీ వ్యవధిలో కూడా పెన్షన్‌ను తిరస్కరించకుండా ఈపీఎఫ్ఓ చూస్తుంది. ఆలస్యమైతే 12% వార్షిక వడ్డీ చెల్లింపుతో కలిగి ఉంటుంది. భీమా డబ్బు మొదట పిఎఫ్ నామినేకి వస్తుంది. నామిని లేకపోతే జీవిత భాగస్వామి, 25 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న కుమారులు లేదా పెళ్లి కాని కుమార్తెలు క్లెయిమ్ చేసుకోవచ్చు. అందువల్ల పిఎఫ్‌లో ఈ నామినేషన్ పూర్తి చేయడం చాలా ముఖ్యం. ఇది ఉద్యోగి లేని సందర్భంలో కుటుంబానికి సులభంగా వేగంగా ఆర్థిక రక్షణను అందిస్తుంది. కానీ ఈ బీమా లాభం ఉపయోగకరంగా ఉండడానికి కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించడం అవసరం. ఉద్యోగి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల ఈ డి ఎల్ ఐ పూర్తిగా కంపెనీ భారం కాబట్టి ఉద్యోగి ఖాతాలో జమయ్యే పిఎఫ్ మొత్తానికి ఇది ప్రభావితం అవ్వదు. దీనివలన ఉద్యోగి డబ్బు పొదుపు రిటైర్మెంట్ సొమ్ము అలాగే ఉంటుంది. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఇడిఎల్ఐ పథకం కింద కవర్ మొత్తం సాధారణంగా ఉద్యోగి మరణించిన సందర్భంలో మాత్రమే చెల్లించబడుతుంది. ఉద్యోగి ఇంకా పనిచేస్తున్నప్పుడు లేదా కేవలం ఉద్యోగం విడిచేసిన సందర్భాల్లో కవరేజీ కొనసాగదు. అందువల్ల జీవిత బీమా ప్రాధాన్యతను తెలుసుకోవడం కుటుంబానికి భవిష్యత్తు ఆర్థిక భద్రత కల్పించడం అవసరం. తద్వారా పీఎఫ్ ఖాతా ఉంటే ఉద్యోగికి ఒక అద్భుతమైన సురక్షిత లాభం లభిస్తుంది. ఇది ఉద్యోగి కుటుంబానికి ఆకస్మిక పరిస్థితుల్లో ఆర్థిక భారం తగ్గిస్తుంది. ఈ డి ఎల్ ఐ ద్వారా 7 లక్షల వరకు ఉచిత కవర్ అనేది పొందటం ఒక అపారమైన అవకాశం. అందుకే పిఎఫ్ ఖాతాలో ప్రతి ఉద్యోగి ఈ హిడెన్ లాభాన్ని తెలుసుకొని అవసరమైన పత్రాలను సకాలంలో సిద్ధం చేయడం అత్యంత అవసరం.

## పెండింగ్ అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు వినతి



తిరుపతి జిల్లాలో మొదటి జాబితాలో మంజూరై పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎపిడబ్ల్యూజేఎఫ్ నాయకులు మార్చి 26న కలిసి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన ఫెడరేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు జి.చెంగల్రాయులు(గాంధీ), వళిగళం గోపీ, జిల్లా ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, సీనియర్ జర్నలిస్ట్ ఆలూరు గిరిధర్, కోశాధికారి శ్రీనివాస్, తిరుపతి నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు బాలసుబ్రమణ్యం, కుమార్, కోశాధికారి మణి తదితరులు ఉన్నారు. మొదటి జాబితాలో పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులతో పాటు రెండో జాబితా సమావేశం కూడా త్వరగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టరు ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహిస్తామని, అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ నూతన జిల్లా కమిటీకి ఎన్నికయినవారిని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏబీఎన్ రిపోర్టర్ పూర్ణచంద్రరావు మృతి



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ బ్యూరో రిపోర్టర్ కేశంనేని పూర్ణచంద్రరావు (54) గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇటీవల ఆయన బ్రెయిన్ స్ట్రోక్ గురికాగా విజయవాడ నుంచి గుంటూరుకు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించడంతో ఆయన మృతి చెందారు. ఆయన మృతికి పలువురు జర్నలిస్టులు సంతాపం తెలియజేశారు. ఏబీఎన్ పూర్ణ పేరుతో అందరికీ సుపరిచితుడుగా ఆత్మయుడిగా ఉండే పూర్ణ మృతి తీవ్ర విచారకరం. అందరితో కలివిడిగా ఉంటూ ఎంతో మంది స్నేహితులను సంపాదించుకున్న పూర్ణ చిన్న వయసులోనే అందరికీ దూరం అవడం విషాదకరం. పూర్ణ ఎబిఎన్‌లో పనిచేయడానికి ముందు వివిధ ఛానళ్లలో పనిచేశారు. కెమెరామెన్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించిన పూర్ణ అనంతరకాలంలో రిపోర్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఈటివీ, ఎన్‌టివిలలో ఆయన విజయవాడ కేంద్రంగా పనిచేశారు. కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేసినప్పటికీ ఆయనకు విజయవాడ పట్ల ఉన్న మమకారంతో వృత్తి జీవితాన్ని అక్కడే కొనసాగించారు. రిపోర్టర్‌గా తెలుగుదేశం పార్టీ బీట్ చూస్తున్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పూర్ణ ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. పూర్ణ కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్‌లు పూర్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

# గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రౌతుపండు మృతి



గోకవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా పనిచేస్తున్న రైతుపండు (53) సాక్షి విలేకరిగా చానల్లో పనిచేస్తున్నాడు. ఆయనకు గుండెపోటు రావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన్ని చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. గోకవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా జర్నలిస్టులకు సేవ చేయడంలో ముందుస్థానంలో నిలిచేవాడు. సాక్షి ఛానల్ విలేకరి రౌతు పండు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నిలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్‌రాజ్, ఎం.లక్ష్మణ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మట్టపర్తి శ్రీనివాస్, వాకాడ బాబులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పండు కుటుంబ సభ్యులకు తమ సానునూతిని వ్యక్తం చేశారు.

**చావులోనూ ఔదార్యం**

రౌతు పండుకు చనిపోతానని తెలిసినప్పటికీ ఆయన ఎంతో ఔదార్యంతో తన శరీరాన్ని దహనం చేయవద్దని వైద్య కళాశాలకు అప్పగించమని కోరారు. గతంలో జనవరి 25న తొలిసారి ఆయనకు గుండెపోటు వచ్చిన సమయంలో స్వీయంగా ఆయన రికార్డు చేసిన వీడియో ద్వారా ఈ విషయం తెలిసింది. ఈ విడియో ఆయన అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో బయటపడింది. ఆయన గుండెపోటు తొలిసారి వచ్చిన సమయంలోనే తమ మరణాన్ని ముందుగా ఊహించారు. అనుకోనిది జరిగిన సమయంలోకూడా నలుగురికి ఉపయోగపడాలనే ఆలోచనతోనే ఆయన సెల్‌ఫోన్‌లో తన ఆలోచనలను రికార్డు చేశారు. ఆయన ఆ వీడియోలో “నాకు గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి వెళుతున్నాము. మృతి చెందితే నా శరీరాన్ని జిఎస్ఎల్ వైద్య కళాశాలకు ఇవ్వండి. దహనం చేయవద్దు.” అంటూ అందులో పేర్కొన్నారు. ఆ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు దహన కార్యక్రమాలను స్వస్తి పలికి భౌతికకాయాన్ని జిఎస్ఎల్ వైద్య కళాశాలకు అప్పగించారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్ విద్యలో రాయితీ కల్పించాలి




వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని కాజులూరు మండల ప్రెస్ క్లబ్ నాయకులు కోరారు. ఈమేరకు కాజులూరులో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చందాల వీరవెంకట సత్యనారాయణ(బాబీ) అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు జర్నలిస్ట్ సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ రాంబాబుని కలిసి వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు రాయితీతో కాజులూరు మండల ప్రయివేటు విద్యాసంస్థల్లో సీట్లు కేటాయించాలని కోరారు. అదేవిధంగా 121సీ రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్(ఆర్టీఈ) ద్వారా జర్నలిస్టుల పిల్లలకు 1 వ తరగతి పిల్లలకు ఉచిత విద్యా అవకాశం కల్పించాలని కోరారు. సంబంధిత అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ రాంబాబుకు సమర్పించారు. రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాశాఖధికారులతో, ప్రయివేట్ విద్యాసంస్థలతో చర్చించి జర్నలిస్టుల పిల్లలకు రాయితీతో కూడిన విద్య అందించేందుకు కృషి చేస్తానని ఎంపీడీఓ రాంబాబు స్పష్టం చేశారు. అదేవిదంగా రైట్ టూ ఎడ్యుకేషన్ ద్వారా 1వ తరగతిలో చేరే జర్నలిస్ట్ పిల్లలకు విద్యనందించే అంశంపై విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన రాంబాబు, గౌరవ అధ్యక్షులు టీవీ వెంకటరెడ్డి(వాసురెడ్డి), కోశాధికారి వరదా వెంకటేశ్వరరావు, గుబ్బల నాగేంద్రకుమార్, చొల్లంగి ఓంకార్, కాపు ఆంజనేయులు, గంధం రాంబాబు, రాయుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు





**అనంతపురం ప్రెస్‌క్లబ్ ఎన్నికల నిర్వహణ, భవిష్యత్తు కార్యచరణపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా బ్యూరో స్టాఫర్లు, ఎడిషన్ ఇన్‌చార్జ్, డెస్క్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. సభ్యత్వం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం జరిగింది. త్వరలో ఎన్నికలు పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది.**



## సీనియర్ జర్నలిస్టు సుబ్రమణ్యం మృతి

అయినవిల్లి మండలం వీరవల్లి పాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఫెడరేషన్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు ముద్దన సుబ్రహ్మణ్యం అనారోగ్య రీత్యా మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు ప్రసాద్‌లు సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

# పల్నాడులో నియోజకవర్గ కమిటీల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మహాసభలు పరిపూర్తి చేసుకునే పనిలో నిమగ్నమై ఉంది. అందులో భాగంగా పల్నాడు జిల్లాలోని వివిధ నియోజకవర్గ సమావేశాలను నిర్వహించి కమిటీలను ఏర్పాటుచేసుకున్నది. వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేసుకుని జిల్లా మహాసభల నిర్వహణకు సిద్ధమవుతోంది.



వినుకొండ నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక

విలేకరుల సమస్యలు పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు జర్నలిస్టులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఎన్ ప్రసాద్ అన్నారు. వినుకొండ నియోజకవర్గం ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ సమావేశం స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో నిర్వహించగా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉండి వారి హక్కుల సాధనకు ముందుకు సాగాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, పెన్షన్ లాంటి సంక్షేమ సదుపాయాలు కల్పించాలని సంఘం ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పట్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ అండగా నిలుస్తుందని వివరించారు. జిల్లా కమిటీ నాయకులు బాబు, బుజ్జి బాబు, తెప్పల శ్రీనివాసరావు, నరసయ్య జర్నలిస్టులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

**నూతన కార్యవర్గ ఎన్నిక**

ఏపీడబ్ల్యూజేఎఫ్ వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులుగా కేసానివల్లి సుబ్బారావు, కార్యదర్శిగా వంగపల్లి బ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా మేడపు వెంకట్రావు, కోశాధికారిగా గడ్డం ఆంజనేయులు, గౌరవాధ్యక్షులుగా పెద్దిశెట్టి దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులుగా జాన్ బాబు, హరి ఫిరోజ్‌లను ఏకగ్రీవంగా పెనుకున్నట్లు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు తెలిపారు.

మాచర్ల నియోజకవర్గ కమిటీ

మాచర్ల నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక పట్టణంలోని నవేరా లాడ్జి సమావేశం మందిరంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి ఎం ప్రసాద్‌రావు, జిల్లా నాయకులు జి లక్ష్మీనారాయణ, కారుమంచి వెంకట నరసయ్య, బుజ్జిబాబుల సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా షేక్ మహమ్మద్ ఖాసిం, కార్యదర్శిగా ఉప్పు ప్రసాద్, కోశాధికారిగా పాటిబండ్ల చెన్నకేశవ, గౌరవాధ్యక్షులుగా ఉప్పుతోళ్ళ రమేష్, ఉపాధ్యక్షులుగా పావులూరి సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా షేక్ ఇమామ్, కార్యవర్గ సభ్యులుగా కోట రవికుమార్, ఉప్పు పాపారావు, కే సునీల్ కుమార్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పెన్షన్ వంటి సంక్షేమ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు సంఘం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మాచర్ల నియోజకవర్గ జర్నలిస్టులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు విలేకరులు పాల్గొన్నారు.








**గురజాల నియోజకవర్గ కమిటీ ఏర్పాటు**

గురజాల నియోజకవర్గ కమిటీ ఎన్నిక గురజాల నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాచేపల్లి పట్టణంలో సమావేశం జరిగి నూతన కమిటీని ఎన్నికయింది. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు బి ఎన్ ప్రసాద్ హాజరయ్యారు. అధ్యక్షులుగా శీలం శివ. ఉపాధ్యక్షులుగా సిద్ధి గోపాలకృష్ణ. కార్యదర్శిగా వేల్పుల చైతన్య. సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ రహీం. కోశాధికారి కొత్తపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా ఎర్రమోతు సుధాకర్‌రావు, వేల్పురి గణపతిరావు, ఎలిసెట్టి గోపి ఎన్నికయ్యారు. సమావేశంలో గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రణయ్ రాయ్ దంపతులపై లుక్ అవుట్ ఉత్తర్వులు రద్దు

కేంద్ర దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన కేసుల్లో ఎన్డిటివి వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌పై జారీచేసిన లుకౌట్ ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు రద్దు చేసింది. ఆ దంపతులు దర్యాప్తుకు సహకరించినంత కాలం ఈ ఉపశమనం కొనసాగుతుందని న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్త అన్నారు. పిటిషనర్లు దర్యాప్తుకు సహకరించే సవాలు చేసిన లుకౌట్ ఉత్తర్వులు రద్దు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. పూర్తి వివరాలు ఉత్తర్వుల రూపంలో వెలువడాల్సి ఉంది. 2017-2019లో సిబిఐ దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల తర్వాత తెరిచిన ఎల్వోసీలను సవాలు చేస్తూ రాయ్ కుటుంబం 2021లో కోర్టును ఆశ్రయించింది. 2017 ఎఫ్ఐఆర్ క్వాంటం సెక్యూరిటీస్ లిమిటెడ్‌కు చెందిన సంజయ్ దత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు అయింది. రాయ్ కుటుంబంతో సంబంధం ఉన్న ఆర్.ఆర్.పి.ఆర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి ఐసిఐసిఐ బ్యాంక్ ఇచ్చిన రుణాన్ని తిరిగి చెల్లించడంలో అవకతవకలు జరిగాయని దీనివల్ల బ్యాంకుకు 48 కోట్ల నష్టం వాటిలిందని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఆ కేసులో దర్యాప్తు సంస్థ ముగింపు నివేదిక దాఖలు చేసింది. 2019 నాటి ఎఫ్ఐఆర్ ఎన్డిటీవీ వ్యవస్థాపకులు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలకు సంబంధించినది. ఢిల్లీ హైకోర్టు జనవరిలో రాయ్ కుటుంబానికి జారీ చేసిన 2016 ఆదాయపు పన్ను నోటీసులను ఏకపక్షమైన పేర్కొంటూ రద్దు చేసింది. అలాగే టోకెన్ ఖర్చుగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెల్లించాలని ఆ విభాగాన్ని ఆదేశించింది.



# సీనియర్ పాత్రికేయుడు బివిఆర్ మృతి

కంచికచర్లకు చెందిన సీనియర్ పాత్రికేయులు, సత్యాగ్రహం పత్రిక రిపోర్టర్ బచ్చు వెంకటేశ్వరరావు (53) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మధ్యాహ్నం భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. 108 సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే కంచికచర్లలోని జర్నలిస్టులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. స్నేహశీలి, మృదు స్వభావి బివిఆర్ ఆకస్మిక మరణం అందరినీ కలచివేసింది. ఆయనతో సాన్నిహిత్యం ఉన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు. బి.వి.ఆర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే కలిమిశ్రీ, ఎంబీనాథన్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# తిరుపతిలో ఫెడరేషన్ జిల్లా మహాసభ సంరంభం







ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తిరుపతి జిల్లా మహాసభల ఏర్పాట్లు చాలా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కొత్త జిల్లా ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి మహాసభ ఇది. జిల్లాలోని శ్రీకాళహస్తి, సుళ్ళూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటు సమావేశాలు జరిగాయి. నియోజకవర్గ కమిటీలు ఏర్పాటయ్యాయి. జిల్లా మహాసభ తిరుపతిలోని రాస్ భవన్‌లో మార్చి 22వ తేదీ జరిపేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఫెడరేషన్ చేపడుతున్న కార్యకలాపాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ అన్ని నియోజకవర్గాల్లో కమిటీల ఆధ్వర్యంలో తిరుగుతున్నారు. జిల్లా అంతటా మంచి స్పందన లభిస్తోంది. జిల్లా మహాసభలను ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ అంగీకరించారు. పలువురు శాసనసభ్యులతో పాటు వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు మహాసభ ప్రారంభ సమావేశానికి హాజరై తమ సందేశాలను ఇస్తారు. మహాసభ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తుంది. అనంతరం జిల్లా కమిటీకి కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటుంది.





# సీజేఐ గారూ కార్మికులు పురుగుల్లా చావాలా?

రిపబ్లిక్ దినోత్సవం నడిరేయి వేళ దక్షిణ కోల్‌కత్తా సరిహద్దుల్లోని నజీరాబాద్ అనంద్‌పూర్ గోదాముల సముదాయంలో కార్మికులు సజీవ దహనమైపోతున్న విషాదకాండ దేశాన్ని కలచివేసింది. మృతదేహాలను వెలికి తీసే పని పూర్తి కావడంతో జనవరి 29 నాటికి మృతుల సంఖ్య 21కి చేరింది. మీడియాలో వచ్చే తాజా సమాచారం ప్రకారమైతే మృతుల సంఖ్య కనీసం 31కి పెరిగింది. నిజానికి మొదలు చెప్పింది కావాలని తగ్గించిన సంఖ్య. ఎందుకంటే జనవరి 29కే 28 మంది ఆచూకీ తెలియవలసి ఉంది. ఏదో తాత్కాలిక గుడారంగా ఉపయోగిస్తున్న ఈ గోదామును చుట్టుముట్టిన మంటలు చాలా భయానకమైనవి. బెంగాల్ రాష్ట్రం ఇరుగుపొరుగు జిల్లాల నుంచి తీసుకువచ్చిన వలస కార్మికులను ఈ గోదాంలో బయటనుంచి తాళాలు వేసి ఉంచారన్న వార్త ఈ ఘటనలోని నేరస్త కోణాన్ని బయటకు తెచ్చింది. ఆ రాత్రి వారు గాఢనిద్రలో ఉండడంతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై మరణించారు. ఏ విధంగానూ బయటకు వచ్చే మార్గం లేకపోయింది. వారు దేశంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'వావ్ మోమో' స్నాక్స్‌ను తయారు చేసే కార్మికులు. ఆధునిక కాలంలో కొనసాగుతున్న భయానక బానిసత్వం ఏమిటో ఈ ఘటన కళ్ళకు కట్టింది. ఇలాంటి బ్రాండ్ల వెనుక ఎంత ఘోరమైన దోపిడీ దాగి ఉంది తెలుస్తుంది. ఇది కేవలం ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలు కాదని గ్రహించడం అవసరం. ఇంత అంతులేని లాభాల కోసం పాపులాడే అమానవీయ పరిస్థితుల కారణంగా పాతుకుపోయిన ఒక హంతక వ్యవస్థకు ఈ ప్రాణాలు బలయినాయి. ఎన్ని గంటలు పనిచేయించాలి? అదనపు గంటలకు ఎంత చెల్లించాలి? కార్మికులు సంఘంగా ఏర్పడే హక్కులు ఇలాంటివేవీ అనుమతించకుండా కార్మికులకు సామాజిక భద్రతను నిరాకరించే వ్యవస్థ అది. ఈఎస్ఐ ప్రావిడెంట్ ఫండ్ వంటి ప్రాథమిక కార్మిక హక్కులను కూడా వారికి లేకుండా చేస్తున్నారు. వారి కుటుంబాలకు చెప్పుకోదగిన ఎలాంటి భద్రత ఏర్పాట్లు లేవు. మిఠాయి దుకాణాల వంటి వాస్తవాలతో బతికే అసంఘటిత రంగ కార్మికుల విషయంలో ఇదే నిజం వర్తిస్తుంది అగ్నిమాపక యంత్రాలు గాని అత్యవసర ద్వారాలు కానీ లేకుండా కనీసమైన గాలి వెలుతురు సోకకుండా వారు పనిలో మగ్గిపోతుండాలి.

ఆద్యంతం నిర్లక్ష్యమే

ఈ విషాదం తీవ్రత ఇంతటితోనే సమస్య పోలేదు. ఘోరానికి కారకులైన నేరస్తులను బోనెక్కించేందుకు అధికారులు చిటికెన వేలు కూడా కదల్చలేదు. చెప్పుకోదగినన్ని రోజులు గడిచినా సరే యజమానులను అరెస్టు చేయలేదు. ప్రమాద స్థలాన్ని సందర్శించే అవకాశం లేకుండా మూసి వేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కూడా విషాదం వాస్తవాలు బయటికి రాకుండా తొక్కిపట్టేందుకు తనవంతు దోహదం చేసింది.

కార్పొరేట్లో పర్యావరణ నిబంధనలను ఇష్టారీతిన ఉల్లంఘించడంలో టిఎంసి రాష్ట్ర ప్రభుత్వం వారితో కుమ్మక్కవుతుందనేది నిస్సందేహం.

భూగర్భంలో చెత్త నిల్వ స్థలాలు, అంతర్జాతీయ ప్రాధాన్యత గల మాగాణి భూముల ఆక్రమణలు కూడా ఈ విషాదానికి ఎంతగానో కారణమైనాయి. మరోవైపున రాష్ట్ర కార్మిక శాఖ కూడా తప్పనిసరిగా జరపాల్సిన తనిఖీలను అగ్నిమాపక ఏర్పాట్లను పర్యవేక్షించకుండా నేరపూరిత నిర్లక్ష్యం వహించింది. ఈ వ్యవస్థాగత హత్యలకు రాష్ట్ర కార్మిక శాఖ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

సిజెఐ వ్యాఖ్యల్లో వాస్తవం ఎంత?

ఏమైనా ఇలాంటి దారుణమైన పని పరిస్థితులు పశ్చిమబెంగాల్‌కే పరిమితం అని అనుకోవడం పూర్తిగా తప్పే. అలాంటి పరిస్థితి పని పరిస్థితులు, వృత్తిపరమైన ఆరోగ్యం ఘోరంగా ఉండటం దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేలా ఉంటుంది. ఏదైనా చెల్లిపోతుందనే వాతావరణంతో పాటు కార్మికుల భద్రత పట్ల ప్రతికూల భావన కూడా అల్లుకుపోయింది. ఇది అతి పెద్ద వర్గ సమస్య. కార్మికుల పట్ల ఈ ప్రతికూల భావన మరింత పెంచడం కోసం అన్నట్టుగా మాట్లాడారు భారత ప్రధాన న్యాయమూర్తి. అది కూడా సుప్రీం కోర్టులోనే. పెన్ లోర్ఖిలాలర్ సంఘం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా ఒక్కసారిగా విరుచుకపడ్డారు. 'నిజంగా దేశంలో ట్రేడ్ యూనియన్ల కారణంగా ఎన్ని పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి? ఒక్కసారి వాస్తవాలు చూద్దాం. సంప్రదాయకంగా వస్తున్న పరిశ్రమలు ఈ జెండా యూనియన్ల కారణంగా దేశవ్యాప్తంగా ఎన్ని మూతపడ్డాయి? వాళ్లకు పని ఉండకూడదు. ఈ ట్రేడ్ యూనియన్ నాయకులు... వారే దేశంలో పారిశ్రామిక అభివృద్ధి ఆగిపోవడానికి చాలా వరకు కారణం.'

చాలా పరుషమైన మాటలు. స్పష్టమైన మాటలు. దేశం మొత్తం మీద నెలకొన్న కార్మిక వ్యతిరేక వాతావరణాన్ని కళ్ళకు కట్టే మాటలు. ఈ పేద వలస కార్మికులు వావ్ మోమో వంటి కర్మాగారాల్లో భిక్షాన్ని తలపించే వేతన కూలితో మృత్యు సన్నిధికి తలపించే పరిస్థితుల్లో గొడ్డు చాకిరితో మగ్గిపోతున్నారంటే పనిచేయవద్దనుకోవడం వల్లనేనా? జస్టిస్ సూర్యకాంత్ తన వర్గపరమైన వ్యతిరేకతతో మాట్లాడారని చెప్పవలసిన రావడం విచారకరం. ఆయన మాటల్లో వ్యక్తమైన వ్యతిరేక భావన వాస్తవాలను చూడకుండా కళ్ళు కప్పేసింది. భారతదేశంలో పారిశ్రామిక విధానాలు, మూసివేతలు, తొలగింపులు లే ఆఫ్‌లపై లేబర్ బ్యూరో నివేదికలు చూస్తే పారిశ్రామిక మాంద్యానికి వాస్తవమైన కారణమేమిటో అత్యంత సమగ్రంగా చెబుతాయి. దేశంలో

పారిశ్రామిక వివాదాలు గణనీయంగా తగ్గిపోయాయని, 2023లో వరుసగా 17 వ ఏడాది తక్కువగా నమోదయినాయని ఆ బ్యూరో నివేదిక చెబుతున్నది. 2023 సెప్టెంబర్‌లో కేవలం 30 వివాదాలు మాత్రమే నివేదించబడ్డాయి. ఇది 2006 పూర్తి భిన్నమైన పరిస్థితి. అప్పుడు అత్యధికంగా 432 పారిశ్రామిక వివాదాలు నమోదయినాయి. తరువాత 2008లో 421, 2007లో 389 నమోదయినాయి.

మరోవైపున చట్టబద్ధంగాను, విరుద్ధంగాను సాగుతున్న పరిశ్రమల మూసివేతలు యూనియన్లనేవి చాలా తక్కువగా ఉన్న, బలహీనంగా కనిపిస్తున్న రాష్ట్రాల్లోనే చాలా ఎక్కువగా ఉన్నాయని విదితమవుతోంది. విలీనాలు, మార్పిళ్ళు, రద్దుల వల్ల గత ఐదేళ్లలో 2,04,268 ప్రైవేట్ కంపెనీలు మూతపడ్డట్టు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలియజేయడం ఆసక్తికరం. లేదంటే 2013లో కంపెనీల చట్టం కింద ప్రతిష్టంభనలో చిక్కాయి. అంతేకాక భారతీయ పరిశ్రమల ప్రతిష్టంభన, దివాళా బోర్డు లెక్కలు చూసినా, ప్రభుత్వ రంగ బ్యాంకులు రాబట్టగలిగే బకాయిల శాతం చూసినా ఈ మూసివేతలకు కారణాలు బాగా తెలుస్తాయి.

సంక్షోభం అసలు కారణాలు

అందువల్ల సిజెఐ మాటలు పూర్తిగా పొరపాటు దిశలో ఉన్నాయి. మూసివేతను రుద్దుతున్నది ట్రేడ్ యూనియన్ల వల్ల ఉత్పన్నమైన పారిశ్రామిక వివాదాలు కాదు. వాస్తవం అందుకు పూర్తి భిన్నం. ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థ ఆర్థిక వ్యవస్థలో మితిమీరిన కేంద్రీకరణ, ద్రవ్యీకరణ వల్ల ఉత్పన్నమైన అంతర్గత సంక్షోభమే ఇందుకు దారితీస్తున్నది. చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) రంగాన్ని, ఉత్పాదకరంగాన్ని ఇది మరింత దారుణంగా దెబ్బతీస్తున్నది. ఇవన్నీ కలిసే ప్రస్తుత మూసివేతలకు దారితీస్తున్నాయి.

పారిశ్రామిక రంగ సంక్షోభానికి కారణాలేమిటో ఇటీవల ఆర్థిక సర్వే, అలాగే బడ్జెట్ సమీక్ష ముందస్తు అంచనాలు కూడా నొక్కి చెప్పాయి. ఆర్థిక వ్యవస్థలో స్థూలగిరాకి లేకపోవడమే పరిశ్రమలు నడపలేని పరిస్థితిని సృష్టిస్తున్నది. తీవ్ర అసమానతలు, ఉద్యోగ రహిత అభివృద్ధి నమూనా వల్ల శ్రామిక శక్తి నిస్పృహ పాలవుతున్నది. ఈ విషాద పరిస్థితి ప్రతిబింబమే ఆనందపూర్ ఘోరం. అధికార వర్గం ఈ వాస్తవాన్ని గుర్తించే బదులు సమిష్టి నిరసనలు, బేరసారాలు లేకుండా చేయాలని సామాజిక భద్రత వల్ల లభించే రక్షణలను తొలగించాలని ప్రయత్నాలు పెంచుతున్నది. వాస్తవానికి దీనికి ప్రతి శక్తిగా న్యాయ వ్యవస్థ ముందుకు రావడానికి ఇంతకంటే మంచి సందర్భం ఉండదు. రాజ్యాంగం 19(1) (సి) ప్రకారం పౌరులకున్న సభ, సంఘ స్వాతంత్ర హక్కుల మేరకు కార్మికుల నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాపాడేందుకు న్యాయవ్యవస్థ అధికారికంగా ముందుకు రావలసిన సందర్భం.

లేబర్ కోడ్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించబడడంతో తాను కార్మికులకు మరింత వ్యతిరేకంగా మారుతున్నది. కార్పొరేట్లకు సుఖవంతమైన పరిస్థితిని సృష్టించే పోకడ మరింత వేగం పుంజుకుంటున్నది. ఏ విధమైన సమిష్టి నిరసనలు, బేరసారాలకు అవకాశం లేకుండా పూర్తిగా తొలగిస్తున్నది. కార్మికులకు గౌరవప్రదమైన మనుగల లేకుండా చేసి పురుగుల్లా చావమని తోసేస్తామా అన్నదే ఇక్కడి ప్రశ్న.

**(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)**

# టీవీ న్యూస్ ఛానళ్లకు కేంద్రం షాక్

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వార్తా ఛానళ్లు అనవసర ఉద్వేగాలను, ఊహాజనిత వార్తలను ప్రసారం చేయడంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీరియస్ అయింది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ వార్తల ద్వారా అనవసరమైన భయాన్ని ప్రజల్లో సృష్టించి టీఆర్పీ పెంచుకుంటున్న టీవీ ఛానళ్లకు కేంద్రం షాకిచ్చింది. నాలుగు వారాలు లేక తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇండియాలో రేటింగ్స్‌ను సస్పెండ్ చేసింది.

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వార్తా ఛానళ్లు అనవసర ఉద్వేగాలను, ఊహాజనిత వార్తలను ప్రసారం చేయడంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీరియస్ అయింది. ఇలాంటి సంచలన వార్తలు యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారి కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా న్యూస్ ఛానళ్ల టీఆర్పీ రేటింగ్‌లను తక్షణమే నిలిపివేయాలని బార్క్ సంస్థను ఆదేశించింది. ఈ నిషేధం నాలుగు వారాల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమలులో ఉంటుందని స్పష్టం చేసింది.

# జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

భూ కబ్జా వ్యవహారంపై వార్తలు రాసినందుకు సూర్య పత్రిక జర్నలిస్టు ఉమాపతి, కెమెరామెన్లపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు జాకీర్ పఠాన్ తీవ్రంగా ఖండించారు.

భూ దందాపై కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులపై తిరుపతి రూరల్ మండలం పేరూరు ప్రాంతానికి చెందిన కొందరు టిడిపి వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆయన తెలిపారు. ఇద్దరు కెమెరామెన్ల కెమెరాలను ధ్వంసం చేయడం దారుణమని అన్నారు.

జర్నలిస్టులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని పేర్కొంటూ, దాడికి పాల్పడిన వారిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరు




జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్ తెలిపారు. మదనపల్లెలో అన్నమయ్య జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం మార్చి16న జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ సౌకర్యం, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య పంటి హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సహకారంతో మార్చి 4న జరిగిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. వేలాదిమంది జర్నలిస్టులు విజయవాడ నగర వీధుల్లో హక్కుల సాధనకు గళమెత్తారని వివరించారు. చలో విజయవాడ కార్యక్రమానికి హాజరైన సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని వివరించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు. సంస్థాగతంగా ఏపీడబ్ల్యూజేఎఫ్‌ను బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వం కృషి చేయాలని వివరించారు అనంతరం సమావేశం మార్చి 31న మదనపల్లి నగరంలో అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ నిర్వహిస్తున్నట్లు తీర్మానించింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు, శాసనసభ్యులు, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించాలని సమావేశం తీర్మానించింది. కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రమేష్ బాబు. ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి కో కన్వీనర్లు రామకృష్ణరెడ్డి, నాగరాజు, హిదాయతుల్లా (అప్ప) శ్రీనివాసులు, జాకీర్, చంద్ర, చిత్తూరు జిల్లా కార్యదర్శి షేక్ సలీం, చిత్తూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిశేఖర్, పుంగనూరు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు సైపుల్లా, డాక్టర్ తల్లా శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు మంజునాద్, కార్తీక్, రవి తేజ, గంగాధర్ తదితరులు హాజరయ్యారు.

# జర్నలిస్టులను చంపే దేశాల్లో ఇజ్రాయెల్ అగ్రస్థానం

2025లో ప్రపంచవ్యాప్తంగా హత్యకు గురైన జర్నలిస్టులలో అత్యధికులు ఇజ్రాయెల్‌లోనే మరణించారని 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ – నివేదిక తెలిపింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా హత్యకు గురైన 129 మంది జర్నలిస్టులలో 84 మందిని ఇజ్రాయెల్‌లోనే చంపారని వార్షిక నివేదిక తెలిపింది. 1992లో డేటాను సేకరించడం ప్రారంభించినప్పటి నుండి ఇవే అత్యధిక హత్యలు. మరణించిన వారిలో ఎక్కువ మంది పాలస్తీనా జర్నలిస్టులు. యెమెన్‌లోని వార్తాపత్రిక కార్యాలయాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 31 మంది సిబ్బంది మరణించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన 47 లక్ష్యంగా చేసుకున్న హత్యలలో 38 ఇజ్రాయెల్ నిర్వహించాయని తెలిపింది. గాజా యుద్ధం, మీడియాపై విధించిన ఆంక్షల కారణంగా ఇజ్రాయెల్ చంపిన వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం వుంది.

మానిటరింగ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం, యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇజ్రాయెల్ దాదాపు 300 మంది జర్నలిస్టులను చంపింది. గాజా, యెమెన్‌లతో పాటు, అంతర్యుద్ధంతో బాధపడుతున్న సూడాన్‌లో, క్రిమినల్ ముఠాలు చురుకుగా ఉన్న మెక్సికోలో పెద్దసంఖ్యలో జర్నలిస్టులు హతులయ్యారు. సూడాన్‌లో తొమ్మిది మంది, మెక్సికోలో ఆరుగురు మరణించారు. రష్యా సైనిక దాడుల్లో నలుగురు ఉక్రేనియన్ జర్నలిస్టులు కూడా మరణించారని నివేదిక పేర్కొంది.



# విశాఖలో ఉగాది ఉత్సవాలు

సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులని ప్రముఖ పారిశ్రామికవేత్త.. చలమాజీ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మట్టపల్లి విశ్వేశ్వరరావు మట్టపల్లి హనుమంతరావు.. సత్యనారాయణలు కొనియాడారు. విశాఖపట్నంలో మార్చి 15న పూర్ణ మార్కెట్ సమీపంలో ఉన్న క్రాంతి థియేటర్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, .బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పరాభవనామ ఉగాది సంబరాలను వైభవంగా నిర్వహించారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన అనేక కార్యక్రమాలు పాత్రికేయులు వారి కుటుంబ సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి..

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మట్టపల్లి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రానున్న పరాభవ నామ సంవత్సర ఉగాది జర్నలిస్టుల కుటుంబాల్లో ఆనందం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. సమాజానికి నిరంతరం తాజా వార్తలు అందించాలనే ప్రయత్నంలో జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడికి గురి అవుతూ తీరిక లేకుండా ఉంటారని అటువంటి వారికి ఆటవిడుపుగా పండుగలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే జర్నలిస్టుల కుటుంబాలతో కలసి ఉగాది సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, వృద్ధులైన జర్నలిస్టులకు పెన్షన్లు, హెల్త్ కార్డులు, అవసాన దశలో ఉన్న జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు తదితర దీర్ఘ కాల పెండింగ్ సమస్యల సాధన కొరకు ఫెడరేషన్ తరపున అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. ఇటీవల విజయవాడ నగరంలో రాష్ట్రంలో జర్నలిస్టులంతా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పెద్దలను కలిశామన్నారు. పెండింగ్ లో ఉన్న సమస్యలకు మంచి పరిష్కారం సాధిస్తామనే నమ్మకం, విశ్వాసం తమకు ఉన్నాయన్నారు. ఎపిడబ్లుజెఎఫ్ విశాఖ నగర అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘానికి సుదీర్ఘ కాలం పాటు నాయకత్వం వహిస్తూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు.

తొలుత పంచాంగ శ్రవణం చేసిన బ్రహ్మశ్రీ పూడిపెద్ది క్రిష్ణ కిరణ్ శర్మ మాట్లాడుతూ రానున్న పరాభవ నామ సంవత్సరంలో అంత మంగళకరంగా ఉంటుందన్నారు.. గురు శక్తి 12 రాశుల వారికి అనుకూలంగా ఉందని ఏళ్ళ నాటి శని ఉన్న వారికి సైతం జూన్ 21 తర్వాత మరింత మంచి రోజులు వస్తాయన్నారు.. వర్షాలు బాగా కురిసి రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు ముగిసి శాంతి నెలకొంటుందన్నారు. పేరుకు తగ్గట్లు ఉండదని రానున్న నూతన సంవత్సరం అందరికీ శుభాలు నింపుతుందన్నారు..ఈ కార్యక్రమంలో వి.మౌనిక పట్నాయక్ నేతృత్వంలోని నృత్య భారతి డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అనంతరం ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ



**(తరువాయి 25వ పేజీలో)**

# పాఠకులు, పౌర సమాజంతోనే జర్నలిజం మనుగడ

పాఠకుల మద్దతుతో నడిచే పత్రికలే స్వతంత్రంగా ఉండగలవు; కార్పొరేట్ మీడియా ప్రభుత్వ అనుగ్రహంపై ఆధారపడుతుంది : న్యాయమూర్తి నాగరత్న

"మంచి జర్నలిజం కేవలం మంచితనంతో మాత్రమే కొనసాగదు," అని న్యాయమూర్తి నాగరత్న పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ, పాఠకుల మద్దతుతో నడిచే పత్రికలే నిజమైన స్వతంత్రతను కాపాడగలవని అన్నారు. కార్పొరేట్ యాజమాన్య నిర్మాణాలు మీడియా సంస్థలను ప్రభుత్వ ఆర్థిక అనుకూలతల ద్వారా ప్రభావితమయ్యేలా చేసే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్, ఇండియా అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం 2025 కార్యక్రమంలో ప్రధానోపన్యాసం చేస్తూ, స్వతంత్ర జర్నలిజం పాఠకులు, పౌర సమాజం ప్రత్యక్ష మద్దతు ఇస్తేనే నిలబడగలదని ఆమె పేర్కొన్నారు.

''పాఠకుల మద్దతుతో నడిచే పత్రికలు ప్రజాహితాన్ని కాపాడటానికి, రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొనడానికి మరింత సన్నద్ధంగా ఉంటాయి," అని ఆమె అన్నారు. స్వతంత్ర రిపోర్టింగ్ ఒక ప్రజా మేలుకై పనిచేసే సేవ అని, దానికి సబ్‌స్క్రిప్షన్ల ద్వారా మద్దతు ఇవ్వాలని పౌర సమాజం గుర్తించాలి అని ఆమె సూచించారు.

"మంచి జర్నలిజం కేవలం మంచితనంతో మాత్రమే నడవదు. ఎవరైనా సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే, అది ఈ విధమైన రిపోర్టింగ్‌కు మద్దతు ఇస్తున్నానని చెప్పడమే," అని ఆమె అన్నారు.

పత్రికా స్వేచ్ఛకు ఆర్థిక ఒత్తిడులు ఒక ముప్పు

కార్పొరేట్ యాజమాన్యంలోని మీడియా సంస్థలు రూపకల్పనలో స్వతంత్రంగా కనిపించినా, ఆర్థిక వాస్తవాలు, రాజకీయ అనుబంధాల వల్ల పరిమితమవుతాయని ఆమె హెచ్చరించారు.

"పత్రికలు ప్రభుత్వానికి నేరుగా లోబడి ఉండకపోయినా, కార్పొరేట్ శక్తిపై ఆధారపడవచ్చు. ఆ కార్పొరేట్ శక్తి తిరిగి ప్రభుత్వ అనుగ్రహంపై ఆధారపడవచ్చు," అని ఆమె పేర్కొన్నారు.

ప్రత్యక్ష సెన్సార్ లేకపోయినా, యాజమాన్య ప్రయోజనాలు, ఆర్థిక ఆధారపడుదల వల్ల సంపాదకీయ స్వాతంత్ర్యం ప్రభావితమవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

ఆమె ప్రకారం, పత్రికా స్వేచ్ఛకు పెద్ద ముప్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) కింద నేరుగా విధించే పరిమితుల వల్ల కాకుండా, ఆర్టికల్ 19(6) కింద న్యాయబద్ధం చేయబడే ఆర్థిక మరియు నియంత్రణ ఒత్తిడుల వల్ల రావచ్చు. యాజమాన్య నియమాలు, లైసెన్సింగ్ చట్టాలు, పన్ను విధానాలు, ప్రకటన విధానాలు, యాంటీట్రస్ట్ చట్టాలు - ఇవి ఆర్థిక నియంత్రణగా చెప్పబడినా, సంపాదకీయ స్వతంత్రంపై గణనీయ ప్రభావం చూపవచ్చు. "చట్టం పత్రికను మౌనం చేయకపోయినా, మాట్లాడే పరిస్థితులను మాత్రం ప్రభావితం చేయవచ్చు," అని ఆమె వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ. పబ్లిక్ సెక్టార్ ప్రకటనల ప్రభావాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. ప్రకటనల ఆదాయం ప్రమాదంలో పడే పరిస్థితుల్లో సంపాదకులు విమర్శనాత్మక రిపోర్టింగ్ విషయంలో స్వయంగా జాగ్రత్తలు పాటించే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.



జస్టిస్ నాగరత్న

చట్టపరంగా ప్రభుత్వాన్ని విమర్శించడానికి స్వేచ్ఛ ఉన్నా, ఆర్థిక పరిమితులు కారణంగా ఆ విమర్శ ఖరీదైనదిగా లేదా నిలవలేనిదిగా మారవచ్చని ఆమె అన్నారు.

"పత్రికా స్వేచ్ఛ పోటీ మార్కెట్లలో ఆర్థిక సాధ్యతపై ఆధారపడితే, అది నిజంగా స్వేచ్ఛగానే ఉంటుందా? అప్పుడు నిజమైన, సమతుల్యమైన పత్రిక ఉండగలదా?" అని ఆమె ప్రశ్నించారు.

పత్రికను కట్టడి చేసే ప్రయత్నాలకు రాజకీయ నేపథ్యం

''సెలెక్టివ్ జర్నలిజం'' అనే ధోరణి పెరుగుతోందని ఆమె హెచ్చరించారు. పత్రికను కట్టడి చేయాలనే ప్రయత్నాలకు ఆర్థిక, రాజకీయ నేపథ్యం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

"స్వేచ్ఛా పత్రిక ఆజ్ఞల ద్వారా సృష్టించబడదు; అది పాఠకులు, రచయితలు, సంపాదకుల పరస్పర చర్యల ద్వారా అభివృద్ధి చెందుతుంది. రాజకీయ లేదా బ్యూరోక్రటిక్ కేంద్రీకృత నియంత్రణ ద్వారా దాన్ని పరిపూర్ణం చేయాలనే ప్రయత్నాలు దాని సహజత్వాన్ని దెబ్బతీస్తాయి," అని ఆమె అన్నారు.

ఇటీవలి కాలంలో పత్రికను నియంత్రించాలనే ప్రయత్నాలకు కేవలం ఆర్థిక కారణాలే కాకుండా రాజకీయ కారణాలూ ఉన్నాయని ఆమె హెచ్చరించారు.



# నిర్లిప్తతకు నజరానా!

జర్మనీ మెట్రో రైలులో తీసిన ఓ ఫోటో ఇటీవల సోషల్ మీడియాలో, జర్మన్ మీడియా సర్కిల్స్‌లో వైరల్ అయింది. ఆ ఫోటోలో ఒక భారతీయ యువకుడు తీవ్రమైన ఆందోళన, నిరాశతో కూర్చుని కనిపించాడు. అతని పక్కనే ప్రపంచ ప్రసిద్ధ నటి, 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సిరీస్‌తో పేరుగాంచిన మైసీ విలియమ్స్ ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సెల్ఫీ కోసం కలలు కనే స్టార్ పక్కన కూర్చున్నా, ఆ యువకుడు కనీసం ఆమెవైపు చూడకపోవడం విస్మయాన్ని కలిగించింది.

**'డెర్ స్పీగెల్' దర్యాప్తు:**

ఈ చిత్రానికి గల కారణాన్ని తెలుసుకునేందుకు జర్మనీలోని ప్రతిష్టాత్మక పత్రిక 'డెర్ స్పీగెల్' రంగంలోకి దిగింది. మ్యూనిక్‌లో ఆ యువకుడిని చివరికి కనుగొన్నారు. అతని నేపథ్యాన్ని పరిశీలించగా, ఆ యువకుడు జర్మనీలో అక్రమంగా నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది.

**యువకుడి కదిలించే మాటలు:**

పత్రికా ప్రతినిధి నటి గురించి ప్రస్తావించి, అతని నిర్లక్ష్యాన్ని ప్రశ్నించగా, ఆ యువకుడు ప్రశాంతంగా, తీవ్రమైన వాస్తవాన్ని వెల్లడించాడు.

"నాకు రెసిడెన్స్ పర్మిట్ లేదు. నా జేబులో ఒక్క యూరో కూడా లేదు. నేను ప్రతిరోజూ 'ఇల్లీగల్‌గా' రైలులో ప్రయాణిస్తున్నాను. అలాంటి పరిస్థితుల్లో నా పక్కన ఎవరున్నారు అనే విషయం గురించి ఆలోచించే అవకాశం నాకు ఉండదు."

**నిజాయితీకి లభించిన ఫలితం:**

అతని మాటల్లోని నిజాయితీ మరియు అతని బతుకు పోరాటం పత్రికా సంస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. మానవతా దృక్పథంతో స్పందించిన 'డెర్ స్పీగెల్', ఆ యువకుడికి తమ సంస్థలో నెలకు 800 యూరోల జీతంతో పోస్టుమాన్ ఉద్యోగాన్ని ఆఫర్ చేసింది.

ఈ ఉద్యోగ ఒప్పందం అతనికి జీవితాన్ని మార్చేసింది. జర్మనీ నిబంధనల ప్రకారం, ఈ రెగ్యులర్ ఉద్యోగ ఒప్పందం ఆధారంగా అతనికి తక్షణమే రెగ్యులర్ రెసిడెన్స్ పర్మిట్ కూడా మంజూరైంది. కేవలం ఒక్క ఫోటో, ఒక ఇంటర్వ్యూతో అక్రమ వలసదారుడి జీవితం అనూహ్యంగా మారిపోయింది.

ఈ సంఘటన ప్రతి చిన్న సంఘటన మరొక దానికి ఎలా ముడిపడి ఉంటుందో, అదృష్టం జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందో నిరూపించింది.

# విశాఖలో ఉగాది ఉత్సవాలు

**(23వ పేజీ తరువాయి)**

జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తొలుత పంచాంగ ఆవిష్కరణ చేయగా మహిళలందరికీ చీరలు పంపిణీ చేశారు పిల్లలకు అందమైన బహుమతులు.. పెద్దవారికి పంచాంగాలు అందజేయడం జరిగింది.. ఈ ఉగాది సంబరాల్లో కార్యదర్శి జి., శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, పితాని సూర్య ప్రసాద్,ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, ఎన్.రామకృష్ణ,.. కృష్ణ పాత్రో జాయింట్ సెక్రటరీలు రవిశంకర్,మధురవాడ ఆనంద్, నాయుడు, నగేష్ బాబు, పక్కి వేణుగోపాల్, కిషోర్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, దేవ త్రినాథ్, అంబటి శేషు, ఏపీ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు ఎన్ అరుణ్ భాస్కర్ (హరి), జగన్నాధం, బొబ్బర ప్రసాద్,రాజశేఖర్, కోస్తా మిర్రర్ ప్రసాద్, ఎంవి రాజశేఖర్, నవతరం రవి శంకర్‌తో పాటు భారీగా జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో పత్రికా స్వేచ్ఛ

ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్య దేశాలలో ముఖ్యమైన అంశం. రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ వంటి సంస్థలు ప్రతి సంవత్సరం వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌ను విడుదల చేస్తాయి. ఇది 180 దేశాలలో పత్రికా స్వేచ్ఛను ర్యాంకింగ్ చేస్తుంది.

2025 ఇండెక్స్ ప్రకారం, ఆర్థిక ఒత్తిడి, రాజకీయ జోక్యం, హింసాత్మక దాడుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ బలహీనంగా వుంది.

పత్రికా స్వేచ్ఛలో ఆర్థిక సమస్యలు కూడా పెద్ద బెదిరింపుగా మారాయి. లెబనాన్ (132వ ర్యాంక్), అర్మేనియా (34వ ర్యాంక్), బల్గేరియా (70వ ర్యాంక్) వంటి దేశాలలో మీడియా యజమానులు రాజకీయ లేదా వ్యాపార ఒత్తిళ్లకు లోనవుతున్నారు.

యూరప్‌లో రష్యా, బెలారస్ వంటి దేశాలలో ప్రభుత్వ నియంత్రణ ఎక్కువగా ఉంది. ఆఫ్రికాలో సుడాన్, ఈజిప్ట్‌లో హింస, లాటిన్ అమెరికాలో మెక్సికో, బ్రెజిల్‌లో మాఫియా దాడులు సమస్యలు వున్నాయి.

జర్నలిస్టులపై దాడులు: ప్రపంచవ్యాప్త గణాంకాలు

2025 సంవత్సరం జర్నలిస్టులకు అత్యంత ప్రమాదకరమైనది. కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 129 మంది జర్నలిస్టులు, మీడియా వర్కర్లు హత్యకు గురయ్యారు. ఇది 1992 నుంచి అత్యధిక సంఖ్య. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రకారం 128 మంది, ఇందులో 11 మంది మహిళలు, తొమ్మిది మంది ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలు. యునెస్కో ప్రకారం 93 మంది హత్యలు, ఇందులో 60 మంది యుద్ధ ప్రాంతాలలో.

దేశాల వారీగా

ఇజ్రాయెల్ దాడులు 86 మంది (ముఖ్యంగా గాజాలో పాలస్తీనా జర్నలిస్టులు) ఇది మొత్తంలో మూడో భాగం. సుడాన్‌లో 9 మంది, మెక్సికోలో 6-9 మంది, ఉక్రెయిన్‌లో నలుగురు (రష్యా దాడులు), ఫిలిప్పీన్స్‌లో ముగ్గురు, భారత్‌లో తొమ్మిది మంది. మధ్యప్రాచ్యంలో (పాలస్తీనా 56) 74 మంది, ఆఫ్రికాలో 18 మంది (సుడాన్ 6), ఆసియా-పసిఫిక్‌లో 15 మంది, అమెరికాలో 11 మంది, యూరప్‌లో 10 మంది హతులయ్యారు.

ఇతర దాడులు

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 329 మంది జర్నలిస్టులు జైలులో ఉన్నారు, 84 మంది కనిపించకుండా పోయారు.

- సమాచారం ప్రకారం 503 మంది నిర్బంధించబడ్డారు. యుద్ధ ప్రాంతాలలో హత్యలు జరిగాయి.

నేరప్రవృత్తి, లంచగొండితనంతో కూడిన రిపోర్టింగ్ కారణంగా మెక్సికో, ఇండియా, పెరూ, బంగ్లాదేశ్‌లో కూడా జర్నలిస్టులను హత్య చేశారు.

ప్రభుత్వాలు జర్నలిస్టులను రక్షించడంలో విఫలమవుతున్నాయి.

ముఖ్యంగా యుద్ధేతర దేశాలలో కూడా హత్యలు పెరుగుతున్నాయి.

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ పరిస్థితి

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ సంక్షోభంలో ఉంది.

2025 ఇండెక్స్‌లో భారత్ 151వ స్థానంలో ఉంది

నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జర్నలిస్టులపై దాడులు పెరిగాయి.

జర్నలిస్టులు వేధింపులు, చంపేస్తామనే బెదిరింపులు, భౌతిక దాడులను ఎదుర్కొంటున్నారు.

దాడులు, హత్యలు:

సంవత్సరానికి సగటున 2-3 మంది జర్నలిస్టులు హత్య చేయబడుతున్నారు, మీడియాకు అత్యంత ప్రమాదకర దేశాలలో భారత్ ఒకటి.

- మన దేశంలో 2025లో తొమ్మిది మంది జర్నలిస్టులను హత్య చేశారు. 33 మందిపై దాడులు జరిగాయి. 19 మంది పై వేధింపుల కేసులు నమోదయ్యాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ముకేష్ చంద్రకర్ అనే జర్నలిస్టు లంచగొండితనంపై వార్తా కథనం రాసినందుకు దారుణంగా హత్య చేశారు.

- వెస్ట్ బెంగాల్‌లో నిరసనలు కవర్ చేస్తుండగా నలుగురు జర్నలిస్టులపై దాడులు.

రాజద్రోహ నేరం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల చట్టాల ద్వారా అరెస్టులు పెరిగాయి.

2025లో 15 మందిని అరెస్టు చేశారు. డిజిటల్ సెన్సార్‌షిప్ పెరిగింది, ఫ్రీడమ్ ఆన్ ది నెట్ 2025 ప్రకారం వేధింపులు, రాతలపై ఒత్తిడి. బ్రాడ్‌కాస్టింగ్ బిల్ 2024 వంటివి మీడియాను నియంత్రించడానికి చేస్తున్న ప్రయత్నాలు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దాడులపై ఫిర్యాదులు చూస్తుంది, కాని ప్రయోజనం లేదు.

## భూపాలపల్లిలో లిఫ్ట్ ప్రమాదం జర్నలిస్టులకు గాయాలు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్లో లిఫ్టు ఒకసారిగా తెగిపడడంతో ఐదుగురు జర్నలిస్టులు గాయపడ్డారు. ఒక కార్యక్రమం కవర్ చేసి లిఫ్ట్‌లో కిందకు దిగివస్తుండగా ఫస్ట్ ఫ్లోర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# ప్రముఖ జర్నలిస్టు హెచ్ కె దువా మృతి



ప్రముఖ జర్నలిస్టు, మాజీ దౌత్యవేత్త, మాజీ పార్లమెంటు సభ్యులు హరికృష్ణ దువా (88) మరణించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయన 1937 జూలై 1న జన్మించారు. తన కెరీర్‌లో భాగంగా హిందుస్థాన్ టైమ్స్ (1987-94), ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (1994-96) ఎడిటర్ ఇన్ చీఫ్‌గా, టైమ్స్ ఆఫ్ ఇండియా (1997-98), ది ట్రిబ్యూన్ (2003-09)లకు ఎడిటోరియల్ అడ్వైజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇద్దరు ప్రధానులు వాజ్‌పేయి, హెచ్ డి దేవ గౌడలకు మీడియా సలహాదారుగా వ్యవహరించారు. విదేశీ వ్యవహారాలు, జాతీయ భద్రతపై చర్చల్లో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. డెన్మార్క్‌లో భారత రాయబారిగా (2001-2003) కూడా పనిచేశారు. జాతీయ భద్రత సలహా బోర్డు సభ్యుడిగా ఉన్నారు. విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ, హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన కన్సల్టేటివ్ కమిటీ సహా అనేక ఉన్నత స్థాయి పార్లమెంటరీ కమిటీల్లో కూడా భాగస్వామిగా వ్యవహరించారు. పద్మభూషణ్‌తోపాటు పంజాబ్ యూనివర్సిటీ, కురుక్షేత్ర యూనివర్సిటీ డి లిట్ బిరుదును ప్రదానం చేశాయి. ఆయన మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షులు ఎస్‌కె పాండే, సెక్రటరీ జనరల్ ఎన్ కొండయ్యలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రావిడెంట్ ఫండ్ ద్వారా ఉచితంగా జీవిత భీమా

ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల జీతం నుంచి ప్రామాణికంగా ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు డబ్బు డిడక్ట్ అవుతోంది. చాలామందికి ఈ డబ్బు పొదుపుగా మాత్రమే అనిపించినప్పటికీ ఇందులో ఒక గోప్యమైన లాభం కూడా ఉంటుంది. ఈపీఎఫ్ఓ ఉద్యోగులకు పెన్షన్ పొదుపు మాత్రమే కాకుండా ఉచిత జీవిత బీమా కూడా అందిస్తుంది.. ఈడీఎల్‌కు ఎంప్లాయ్ డిపాజిట్ లింక్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా ఉద్యోగి మరణించిన సందర్భంగా కుటుంబానికి ఆర్థిక రక్షణ ఇస్తుంది. దీనికోసం ఉద్యోగికి ఒక పైసా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ బీమా మొత్తం ఉద్యోగి జీతం ఆధారంగా నిర్ణయించబడుతుంది. గత 12 నెలల పాదమిక జీతం డియర్ నెస్ అలవెన్స్ ఆధారంగా సగటు జీతానికి 35 రేట్లు లెక్కించబడుతుంది. అదనంగా 1.75 లక్షల బోనస్‌ను జోడిస్తే గరిష్టంగా ఏడు లక్షల వరకు లాభం వస్తుంది. గరిష్ట జీత పరిమితిని 15 వేలుగా నిర్ణయించింది. అందువలన ఎక్కువ జీతం ఉన్న గరిష్ట కవర్ పరిమితం. పిఎఫ్ ఖాతాదారుడు సర్వీసులో ఉన్నప్పుడు మరణిస్తే వారి నామిని లేదా చట్టపరమైన వారసుడు బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. ఈ డి ఎల్ ఐ ఫారం 5 ఐఎఫ్ మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పుట్టిన తేదీ ఋజువు వంటి పత్రాలు సమర్పించాలి. నాన్ కంట్రిబ్యూటరీ వ్యవధిలో కూడా పెన్షన్‌ను తిరస్కరించకుండా ఈపీఎఫ్ఓ చూస్తుంది. ఆలస్యమైతే 12% వార్షిక వడ్డీ చెల్లింపుతో కలిగి ఉంటుంది. భీమా డబ్బు మొదట పిఎఫ్ నామినేకి వస్తుంది. నామిని లేకపోతే జీవిత భాగస్వామి, 25 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న కుమారులు లేదా పెళ్లి కాని కుమార్తెలు క్లెయిమ్ చేసుకోవచ్చు. అందువల్ల పిఎఫ్‌లో ఈ నామినేషన్ పూర్తి చేయడం చాలా ముఖ్యం. ఇది ఉద్యోగి లేని సందర్భంలో కుటుంబానికి సులభంగా వేగంగా ఆర్థిక రక్షణను అందిస్తుంది. కానీ ఈ బీమా లాభం ఉపయోగకరంగా ఉండడానికి కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించడం అవసరం. ఉద్యోగి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల ఈ డి ఎల్ ఐ పూర్తిగా కంపెనీ భారం కాబట్టి ఉద్యోగి ఖాతాలో జమయ్యే పిఎఫ్ మొత్తానికి ఇది ప్రభావితం అవ్వదు. దీనివలన ఉద్యోగి డబ్బు పొదుపు రిటైర్మెంట్ సొమ్ము అలాగే ఉంటుంది. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఇడిఎల్ఐ పథకం కింద కవర్ మొత్తం సాధారణంగా ఉద్యోగి మరణించిన సందర్భంలో మాత్రమే చెల్లించబడుతుంది. ఉద్యోగి ఇంకా పనిచేస్తున్నప్పుడు లేదా కేవలం ఉద్యోగం విడిచేసిన సందర్భాల్లో కవరేజీ కొనసాగదు. అందువల్ల జీవిత బీమా ప్రాధాన్యతను తెలుసుకోవడం కుటుంబానికి భవిష్యత్తు ఆర్థిక భద్రత కల్పించడం అవసరం. తద్వారా పీఎఫ్ ఖాతా ఉంటే ఉద్యోగికి ఒక అద్భుతమైన సురక్షిత లాభం లభిస్తుంది. ఇది ఉద్యోగి కుటుంబానికి ఆకస్మిక పరిస్థితుల్లో ఆర్థిక భారం తగ్గిస్తుంది. ఈ డి ఎల్ ఐ ద్వారా 7 లక్షల వరకు ఉచిత కవర్ అనేది పొందటం ఒక అపారమైన అవకాశం. అందుకే పిఎఫ్ ఖాతాలో ప్రతి ఉద్యోగి ఈ హిడెన్ లాభాన్ని తెలుసుకొని అవసరమైన పత్రాలను సకాలంలో సిద్ధం చేయడం అత్యంత అవసరం.



# జర్నలిస్టు కుటుంబాలకు అండ

ఇటీవల మృతి చెందిన ఏబీఎన్ అన్నవరం రిపోర్టర్ దేగల చినబాబు కుటుంబానికి జర్నలిస్టుల ఫెడరేషన్ అండగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చినబాబు కుటుంబ సభ్యులకు మార్చి 9న ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు చినబాబు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చినబాబు మరణం ఆ కుటుంబానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో జర్నలిస్టుల ఫెడరేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అధికార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చినబాబు జర్నలిజం రంగంలో ఎంతో అంకితభావంతో పనిచేసిన వ్యక్తి అని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఆయన ఎప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. నిజాయితీ, నిబద్ధతతో వార్తలను అందించడంలో ఆయన చూపిన కృషి ఇతర జర్నలిస్టులకు ఆదర్శమని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని, జర్నలిస్టులు లేదా వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని నాయకులు పేర్కొన్నారు. నిరంతరం పని ఒత్తిడితో జర్నలిజం వృత్తిని చేస్తున్న పలువురు అకస్మాత్తుగా మరణిస్తుండడంతో వారి కుటుంబాలు వీధిని పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చినబాబు కుటుంబ సభ్యులు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమయంలో జర్నలిస్టుల సంఘం అండగా నిలవడం తమకు ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పుర్రె త్రినాథ్, కే.వి.సత్యనారాయణ, శ్రీధర్, ఎస్ కే ఇమ్రాన్, దుర్గా శ్రీనివాస్, స్థానిక జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు రమణ, వెంకట్, ప్రసాద్, హరగోపాల్, ప్రవీణ్, లోవరాజు పడాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు శివకిరణ్ మృతి

సింగరాయకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు అంబటి శివకిరణ్ ఆకస్మాత్తుగా మృతి చెందారు. శివకిరణ్‌కు భార్య, తల్లిదండ్రులతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అంబటి శివ కిరణ్ మృతి పట్ల ప్రకాశం జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు జి నాగేశ్వరరావు, బ్రహ్మంలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఎన్డీటీవీలో ఉద్యోగులపై వేటు

ఎన్డిటీవీలో ఉద్యోగులపై వేటు కత్తి వేలాడుతోంది. ఆదాని యాజమాన్యంలోని ఎన్డిటీవీ మరో రౌండ్ తొలగింపులకు సిద్ధమవుతోంది. అన్ని విభాగాలలోని ఉద్యోగుల పనితీరు మెరుగుదల పేరిట తొలగించే చర్యలకు ఉపక్రమించింది. ఈసారి వందమంది ఉద్యోగులు ప్రభావితం అవుతారని సిబ్బంది అంచనా వేస్తున్నారు. నోటీసులు అందుకున్న వారిలో రిపోర్టర్లు, యాంకర్లు, కెమెరా సిబ్బంది హిందీ ఇంగ్లీష్ చానల్స్ నుంచి డెస్క్ సిబ్బంది సహా పలువురు ఉన్నారు. డిసెంబరు 2022లో ఆదానీ గ్రూప్ ఎన్డీటీవీ నియంత్రణను సొంతం చేసుకున్న తర్వాత న్యూస్ రూమ్‌లో హై ప్రొఫైల్ నిష్క్రమణలు ఊపందుకున్నాయి. అప్పటినుంచి ఉద్యోగ రాజీనామాలు, తొలగింపుల రౌండ్లు అడపా, తడప కొనసాగాయి. ఏప్రిల్ 2025లో అప్పటి ఎన్డీటివి నిర్వాహకులు ప్రణయ్ రాయ్ శకానికి స్వస్తి పలకడంతో పాటు ఆయనతో సంబంధం ఉన్న సిబ్బంది అసమానంగా ప్రభావితమయ్యారని ఉద్యోగులు తెలిపారు.

# సమాచార హక్కు చట్టానికి సవరణలు

సమాచార హక్కు చట్టాన్ని సవరించాలని ఆర్థిక సర్వే ప్రతిపాదించింది. ఫైల్ నోటింగ్స్, అంతరంగిక చర్చల రికార్డులు, ముసాయిదా పత్రాలు వంటి వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచకూడదని సూచించింది. 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సవరణలు ముందుకు తెచ్చింది. అయితే వాటిని పార్లమెంట్ ముందు ఉంచేందుకు అవసరమైన మెజారిటీని సంపాదించలేకపోయింది. ఆ సమయంలో ఎన్డీఏ ముఖ్యంగా బిజెపి ఈ సవరణలను తీవ్రంగా వ్యతిరేకించింది. పౌర సమాజం కూడా యూపీఏ చర్యపై నిరసన వ్యక్తం చేసింది. ఇప్పుడు ఎన్డీఏకు చట్టసభలో అవసరమైన మెజారిటీ ఉండడంతో తిరిగి ఆసవరణలను తెరపైకి తెచ్చింది. అధికార యంత్రంగానికి సంబంధించిన ముసాయిదా పత్రాలు అంతరంగిక ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన రికార్డులు ఎన్ని పర్యాయాలు బహిర్గతమయ్యాయి అనే ప్రశ్నకు ప్రభుత్వ వద్ద సమాధానం లేదు. అంతేకాక అవి బహిర్గత కావడం వల్ల ప్రభుత్వ ప్రయోజనాలకు ఏ విధంగా భంగం వాటిలో కూడా చెప్పలేకపోతోంది.

నిర్దిష్టమైన ఆధారాలు కారణాలు చూపకుండానే తాను ఒకనాడు వ్యతిరేకించిన సవరణలనే ఎన్డీఏ ఇప్పుడు ముందుకు తీసుకొస్తుంది. రహస్య చర్చల సమాచారం బయటకి పొక్కకుండా చూడడం. నిర్ణయాల ప్రక్రియను మెరుగుపరచడం దీని ప్రధాన ఉద్దేశం అని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం చెప్పింది. జవాబుదారీ తనాన్ని సమర్థవంతమైన పాలనను సమతూకం చేయడమే లక్ష్యమని తెలిపింది. అనేక ప్రపంచ దేశాలలో ఇదే పద్ధతి అమలులో ఉన్నదని అంటూ తన వైఖరిని సమర్థించుకునే ప్రయత్నం చేసింది. అధికార యంత్రాంగానికి సంబంధించిన పత్రాలను బహిర్గతం చేయడానికి ప్రభుత్వాలు వ్యతిరేకించడం కొత్త కాదు. బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, స్కాట్లాండ్ వంటి దేశాలు తమ సమాచార స్వేచ్ఛ చట్టాలలో ఇలాంటి నిబంధనలను చేర్చాయి. అయితే వాటిని చాలా కాలం అరుదుగా మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఒకవేళ నిబంధనలను అమలు చేసినప్పటికీ అవి కఠినమైన న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయి. ఇప్పటికీ రెండు దశా దశాబ్దాలు గడిచాయి ఆర్టిఐ చట్టాన్ని పునర్ పరిశీలించాల్సిన అవసరం ఉంది ఈ చర్యా దాని స్ఫూర్తిని నీరుగార్చడానికి కాదు. ప్రపంచంలో అమలులో ఉన్న అత్యుత్తమ విధానాలను మనం కూడా అవలంబించాలి. గత అనుభవాలు నేర్పిన పాఠాల దృష్ట్యా మార్పులు తప్పనిసరి అవుతున్నాయి. ఆర్టిఐ చట్టం ఏ ఉద్దేశంతో అమల్లోకి వచ్చిందో దానిని దృఢంగా ముందుకు తీసుకుపోవడానికి ఈ సవరణలు అని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఏదైనా ఒక అంశంపై అధికార యంత్రాంగం తుది నిర్ణయం తీసుకునే వరకు దానికి సంబంధించిన మేథో మదన నోట్స్, కార్యాచరణ పత్రాలు, ముసాయిదా వ్యాఖ్యలను గోప్యంగా ఉంచడమే ప్రభుత్వ ఉద్దేశం అని అధికార వర్గాలు చెబుతున్నాయి. సర్వీస్ రికార్డులు, బదిలీలు, కాన్ఫిడెన్షియల్ స్టాఫ్ రిపోర్టులను బహిర్గతం చేయకుండా కాపాడడం కూడా ఈ సవరణలో భాగమేనని తెలుస్తోంది.




# తిరుపతి నియోజకవర్గ కమిటీ ఏర్పాటు

తిరుపతి నగరంలో ఈ నెల 22వ తేదీ నిర్వహించే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలను జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగలం గోపి పిలుపునిచ్చారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సమావేశం వలిగలం గోపి అధ్యక్షతన జరిగింది. అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్ట్ సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విన్నవించారు. చలో విజయవాడ కార్యక్రమంలో ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేశామన్నారు. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం రిటైర్డ్ జర్నలిస్టులకు వారి వారి సొంత జిల్లాలలో ఆర్టీసీ ఉచిత ప్రయాణం అనుమతికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. త్వరలో జర్నలిస్టుల ఇళ్ల సమస్యలపై కూడా ప్రభుత్వ స్పష్టతనిస్తోందని తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని వెల్లడించారు. ఈనెల 22వ తేదీన తిరుపతి కేంద్రంగా జరగనున్న ఏపీడబ్ల్యు జేఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలను జర్నలిస్టు మిత్రులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ఈ సందర్భంగా తిరుపతి నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ తిరుపతి నియోజకవర్గ అధ్యక్షులుగా ఆవుల సుబ్రమణ్యం (తిరుమల బాల), ప్రధాన కార్యదర్శిగా సి.కుమార్, కోశాధికారిగా మణితో పాటు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు చెంగల్రాయలు (గాంధీ), మోహన్ రావు, అవనిగడ్డ వనిజ, పి.సురేంద్రబాబు, పి కృష్ణమూర్తి, శ్రీను, సురేష్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సుపథ, మన్యసీమ సంపాదకులు రాంజీ మృతి




గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో వున్న సుపథ, మన్యసీమ సంపాదకులు యామిజాల రామనరసింహం (రాంజీ) విశాఖపట్నంలో మార్చి 11న మృతి చెందారు. నగరంలోని గురుద్వారా దగ్గర గల కిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు రాంజీ పెద్ద కుమారుడు భరద్వాజ్ తెలిపారు. యామిజాల రామ నరసింహం స్టీల్ ప్లాంట్లో కొంత కాలం ఉద్యోగం చేశారు. ఐఎన్‌టియుసి కార్మిక సంఘం అధ్యక్షులుగా కూడా పని చేశారు. అనంతరం రాంజీ సుపథ, మన్యసీమ దినపత్రికలతో పాటు యామిజాల పబ్లికేషన్‌ను నడిపారు. రాంజీ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఏబీఎన్ రిపోర్టర్ చిన్నబాబు ఆకస్మిక మృతి



ఏబీఎన్ ఛానల్ అన్నవరం రిపోర్టర్ గా పనిచేస్తున్న దేగల చినబాబు (40) గుండెపోటుతో మృతి చెందారు. ఇంటి వద్ద నీరసంగా ఉందని తుని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆయన చనిపోయారు. సౌమ్యుడిగా పేరున్న చినబాబు పదేళ్లుగా ఏబీఎన్ ఛానల్‌కు సేవలు అందిస్తున్నారు. చినబాబు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు వి నవీన్ రాజ్, ఎం లక్ష్మణులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సీనియర్ జర్నలిస్టు కందాళం రామకృష్ణ మృతి



సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రభూమిలో దాదాపునాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన పాత్రికేయులు, కందాళం రామకృష్ణమా చార్యులు మరణించారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఫోటోగ్రాఫర్ ప్రసాదరావు మృతి



సీనియర్ ఫోటోగ్రాఫర్, మాజీ విలేఖరి మేదూరి ప్రసాదరావు (64) అనారోగ్యంతో పంగులూరులోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన తండ్రిది నాగులప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామం. చిన్నప్పుడే పంగులూరు వచ్చిన ఫోటో స్టూడియో ఏర్పాటు చేసుకుని అక్కడే సరిపడ్డారు తర్వాత మీసేవ నడుపుకుంటూ ఆంధ్రభూమి దినపత్రిక విలేకరిగా పనిచేశారు. ఆ పత్రికను యాజమాన్యం మూసివేసే వరకు ఆయన పనిచేశారు. గతంలో అన్ని పత్రికలకు ఉచితంగా ఫోటోలు అందజేసేవారు. ఫోటోగ్రాఫర్ ప్రసాద్‌గా మండలంలో సుపరిచితుడు. ఆరోగ్యపరంగా ఇటీవల ఇబ్బంది పడ్డారు. గత నెలలో గుండెపోటు కూడా వచ్చింది. చికిత్స అనంతరం ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఆయనకు భార్య సత్యవతి దేవి, కుమారుడు శ్రీహర్ష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శ్రీహర్ష, సోదరుడు నాగేశ్వరరావు కూడా విలేకరులుగా పనిచేస్తున్నారు.

# జర్నలిస్టు అమర్ మృతి

కలసపాడు మండలంలోని రంగారెడ్డి పల్లె గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బోయిళ్ళ అమర్నాథరెడ్డి మరణించారు. అనారోగ్యం పాలైన ఆయన బెంగళూరులో వైద్య చికిత్స పొందుతూ మరణించారు. అమర్నాథరెడ్డి మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కడప జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్ రాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.




డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఫెడరేషన్ మహాసభకు హాజరైన పార్లమెంటు మాజీ సభ్యులు చింతా అనురాధ, శాసనమండలి సభ్యులు కుడిపూడి సూర్యనారాయణరావు తదితరులు



ఏలూరు జిల్లా ఎపిబిజెఎ నూతన కమిటీ సభ్యులతో శాసనసభ్యులు బడేటి చంటి





ఏపిడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజుల చెంగల్రాయులు (గాంధీ), వళిగళం గోపి, కోశాధికారి కె.శ్రీనివాస్



విశాఖపట్నంలో మార్చి 15న జరిగిన ఉగాది ఉత్సవాలు





# జాబ్ క్యాలెండర్

## యువగళం హామీని నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

**10,060** ప్రభుత్వ ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్

| నోటిఫికేషన్ తేదీ | విభాగం | పోస్టుల సంఖ్య |
|---|---|---|
| మే 15, 2026 | ఉన్నత విద్య | 1500 |
| ఆగస్టు 15, 2026 | గ్రూప్ I | 91 |
| | హోమ్ శాఖ | 2778 |
| | ఇతర శాఖలు | 928 |
| సెప్టెంబర్ 15, 2026 | గ్రూప్ II | 750 |
| | ఇంజనీరింగ్ | 503 |
| | ఇతర శాఖలు | 506 |
| అక్టోబర్ 15, 2026 | పాఠశాల/ఇంటర్ విద్య | 3004 |
| మొత్తం ఉద్యోగాలు | | 10,060 |

